

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను



జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.



రంగారెడ్డి మంగళవారం 1-09-2026 సంపుటి: 02 సంచిక : 122 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ట హిమ పావని

Ranga Reddy Tuesday 1-09-2026 Volume :02 Issue: 122 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani



Contact Number
9059328777




## కృష్ణాజలాలపై సీఎం మౌనం..

- తెలంగాణకు తీరని ద్రోహం
- ఏపీ ప్రభుత్వానిది అడ్డగోలు నీటి దోపిడీ
- కేఆర్ఎంబీది ప్రేక్షకపాత్రే
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించాలి
- మాజీమంత్రి హరీశ్‌రావు డిమాండ్

హైదరాబాద్

కృష్ణా జలాల దోపిడీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మౌనంగా ఉండడం తెలంగాణకు తీరని ద్రోహం చేయడమే అవుతుందని బీఆర్‌ఎస్‌ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి టి హరీశ్‌రావు విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను ఏపీ ప్రభుత్వం అక్రమంగా దోపిడి చేస్తున్నదని సోమవారం ఎక్స్ ద్వారా ఆయన ట్వీట్ చేశారు. ఏపీ ప్రభుత్వం అడ్డగోలుగా నీటిని తరలిస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపకపోవడం తెలంగాణ రైతాంగానికి తీరని నష్టమని తెలిపారు. నీటి కేటాయింపులు లేకున్నా వరద జలాలు రాకున్నా వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తున్నదని పేర్కొన్నారు. అయినా సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో

-మిగతా 2 లో




## టీవీకే-కాంగ్రెస్ మధ్య విబేధాలు..

- ప్రధానిగా రాహుల్‌కు విజయ్ మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పట్టు
- మద్దతు లేకుంటే మంత్రి పదవులకు రాజీనామా చేస్తామని హెచ్చరిక
- విజయ్‌ను జాతీయ నాయకుడిగా ప్రొజెక్ట్ చేస్తున్న టీవీకే నేతలు
- కూటమి బలంపై కాంగ్రెస్ వ్యాఖ్యలు.. రాజకీయంగా వేడెక్కిన తమిళనాడు




## అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

- కెనడా దారుణమైన దుర్వినియోగదారు
- కెనడాలో ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి
- ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు

# బహుజన తెలంగాణ కావాలి

### ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పులు తేవాలన్న సంకల్పంతో ముందుకు వచ్చా

- ఏ తప్పు చేయకుండానే జైల్లో పెట్టారు.. అప్పుడే నేను ఏ తప్పు చేయలేదని చెప్పా
- నాలుగేళ్లు ఈడీ, సీబీఐ ఇబ్బంది పెట్టినా ధైర్యం సడలలేదు.. దారి తప్పలేదు
- అమ్మ ఇంటివాళ్లు నిర్దాక్షణ్యంగా తరిమేస్తే అత్తింటి వాళ్లు కన్న బిడ్డలా అక్కున చేర్చుకున్నారు
- తండ్రి, కూతురును పాపిన ప్రశాంత్ రెడ్డిని జీవితంలో క్షమించను.. నా ఉసురు తగులుతుంది
- ఓ వైపు కాంగ్రెస్ పై పోరాటం చేస్తూనే టీఆర్ఎస్ నిర్మాణం చేస్తాం
- వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ :

తెలంగాణకు ఇప్పుడు కావాల్సింది బంగారు తెలంగాణ కాదు బహుజన తెలంగాణ అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. తెలంగాణ సాధించుకుంటే జీవితాలు మారిపోతాయని భావించి ప్రజలకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాల్సిన అవసరముందని ఆమె అన్నారు. సోమవారం నిజామామాబాద్ లో ఏర్పాటు చేసిన పాంచజన్య సంకల్ప సభలో కవిత ప్రసంగించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నాలుగిండ్లు మాత్రమే బంగారు మాయమయ్యాయని అన్నారు.

-మిగతా 2 లో







## నేపాల్‌కు మళ్లీ ముప్పు

- పెరిగిన భోటేకోసి నీటి మట్టం
- చైనా నుంచి వరద హెచ్చరికలు
- 903కు చేరిన మృతులు
- 5,000 మందికి పైగా మిస్సింగ్
- సారంగాల్లో భారత్ బృందం వెతుకులాట
- కుళ్లిపోతున్న మృతదేహాలు.. సామూహిక అత్యేష్టియులు
- గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు షురూ

ఖాట్మండు:

ఆగస్టు 26న నేపాల్, టిబెట్ సరిహద్దు హిమాలయాల్లో మంచు, రాయి కరగడంతో మొదలైన ఆకస్మాత్తు వరదలో నేపాల్ జాతీయ విపత్తు ప్రాధికార సంస్థ సోమవారం సాయంత్రం విడుదల చేసిన లెక్కల ప్రకారం 903 మంది మరణించారు. 5,000 మందికి పైగా తప్పిపోయినవారు. తప్పిపోయినవారిలో 592 మంది విదేశీయులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల్లో పనిచేసిన 933 మంది, భద్రతా సిబ్బంది కూడా ఉన్నారు. 10,451 మందిని రక్షించారు. మృతదేహాలు ఎక్కువగా చిత్వన్ జిల్లాలో 272, తూర్పు నావల్పరాసిలో 207, పశ్చిమ నావల్పరాసిలో 151, నువాకోట్‌లో 95, గోర్ఖాలో 62, ధాడింగ్‌లో 55, తనహూన్‌లో

-మిగతా 2 లో

# విపక్షం విఫలం

- రోజుల్లో ఒక్కరోజైనా అసెంబ్లీకి రాని కెసిఆర్
- బంధువులు చనిపోతే వెళ్తారు.. మనవడు గాయపడితే పరామర్శిస్తారు.. కానీ ప్రజల కోసం ఒక్కరోజూ బయటికి రారు
- ఈ వెయ్యి రోజుల్లో కెసిఆర్ కు రూ.1.24 కోట్ల జీతం
- ఆయన భద్రతకు రూ.22కోట్ల ఖర్చు
- వెయ్యి రోజుల్లో నేను ఒక్కరోజు సెలవు తీసుకోలేదు
- నాకు, ఆయనకు పోలికా?
- కెసిఆర్ రాజీనామా కోరుతూ 6న ఇందిరా పార్కు వద్ద భారీ స్థాయిలో నిరసన
- 7నుంచి అసెంబ్లీలో బిఆర్ఎస్ భాగోతం బయటపెడతా
- 32 నెలలుగా ఫస్ట్ నే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నాం
- ఎన్ని ఇబ్బందులు వచ్చినా.. ఉద్యోగుల జీతాలు ఆపలేదు
- అంబర్ పేటలో 10 ఎకరాల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు
- అల్వాల్ టిమ్స్ కు అంజయ్య.. ఎల్బీనగర్ టిమ్స్ కు కొండా లక్ష్మణ్ బాపూజీ.. వరంగల్ ఆస్పత్రికి జయశంకర్ పేర్లు పెడతాం
- హైదరాబాద్ లోని మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

**కెసిఆర్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ నేటినుంచి ఊరూరా ఆందోళనలు**



హైదరాబాద్

కెసిఆర్ కు, నాకు పోలికా..? నందికి, పందికి ఉన్నంత తేడా ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా కెసిఆర్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. 1,000 రోజుల ప్రభుత్వ సొమ్ము మెక్కి గంట కూడా పనిచేయని కెసిఆర్ వెంటనే రాజీనామా చేయాలని అన్ని చోట్లా నిరసనలు తెలపాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. నేటి నుంచి ఆరు రోజుల పాటు ప్రతిపక్ష నాయకుడు రాజీనామా చేయాలన్న డిమాండ్ తో నిరసనలు తెలపాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈనెల 06వ తేదీన ఇందిరా పార్క్ వద్ద నిరసన కార్యక్రమాన్ని

-మిగతా 2 లో





## ప్రజల ఆశీర్వాదంతో ప్రజాపాలనకు వెయ్యి రోజులు

- ప్రజాపాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం చారిత్రాత్మక ఘట్టం
- రైతు, మహిళ, యువత సంక్షేమమే ప్రభుత్వ విధానాల కేంద్రబిందువు
- రూ.2 లక్షల రుణమాఫీతో 25 లక్షలకుపైగా రైతులకు లబ్ధి
- రైతుభరోసా, బోనస్‌లతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం
- 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సిలిండర్
- 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలతో యువతకు భరోసా
- యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం
- బీసీ కులగణన, 42 శాతం రిజర్వేషన్లతో సామాజిక న్యాయానికి పెద్దపీట
- ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: మహేష్‌కుమార్ గౌడ్

హైదరాబాద్

ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో ప్రజాపాలన ప్రభుత్వం వెయ్యి రోజులు పూర్తి చేసుకోవడం ఒక మైలురాయి అని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. వెయ్యి రోజుల పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతులు, మహిళలు, యువత, వ్యవసాయ కూలీలు, బలహీనవర్గాలను ప్రభుత్వ విధానాలకు కేంద్రబిందువుగా మార్చామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. రూ. 2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేసి 25.35 లక్షల మంది రైతులకు రూ. 20 వేల కోట్లకు పైగా ప్రయోజనం కల్పించామని చెప్పారు. రైతు భరోసా కింద ఇప్పటివరకు రూ.


-మిగతా 2 లో

## సర్' ద్వారా దేశ జనాభాను ఈసీ తగ్గిస్తున్నది




- ఢిల్లీలో 47 లక్షల ఓటర్ల పేర్లు తొలగింపుపై ఆప్ అధినేత ఆగ్రహం
- 'సర్' పేరుతో ఓటర్లను తగ్గిస్తున్నారని ఎన్నికల సంఘంపై విమర్శలు
- 1.45 కోట్ల ఓటర్లలో 97.53 లక్షల పేర్లే ముసాయిదా జాబితాలో
- జనాభా పెరుగుదలపై ఆందోళన అవసరం లేదంటూ కేజ్రీవాల్ వ్యంగ్యాస్త్రాలు
- '140 కోట్లను 50 కోట్లకు తగ్గించే శక్తి సర్‌కే ఉంది' అంటూ ఎక్స్‌లో వ్యాఖ్య
- జూన్ 30 నుంచి ఆగస్టు 7 వరకు సాగిన ప్రత్యేక సవరణ ప్రక్రియ
- 67 శాతం ఓటర్ల వివరాలే డిజిటలైజ్ చేసినట్లు ఈసీ వెల్లడి
- ఢిల్లీ ఓటర్ల జాబితాపై రాజకీయ దుమారం రేపిన ఆప్ ఆరోపణలు

## భారత్-రష్యా బంధానికి కొత్త బలం




- మోదీ--పుతిన్ భేటీ
- బిష్కెక్ లో ఎస్సీవో సదస్సు సందర్భంగా కీలక ద్విపాక్షిక చర్చలు..
- ఇంధనం, ఎరువులు, రక్షణ, వాణిజ్యం, చెల్లింపుల వ్యవస్థలపై ఫోకస్
- యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపుల అవకాశాలపైనా ఆసక్తి..
- మారుతున్న ప్రపంచ పరిణామాల మధ్య ప్రాధాన్యం సంతరించుకున్న భేటీ

# నేపాల్‌కు మళ్లీ ముప్పు

మొదటి తరువాయి

37, రసువా జిల్లాలో 24 వెలికితీశారు. వరద మొదలైన రసువాలో తక్కువ మృతదేహాలు వెలుగులోకి రాగా గల్లంతు అయిన వారి సంఖ్య ఎక్కువగా ఉంది. నువాకోట్‌లో 1,548 మంది, రసువాలో 865 మంది తప్పిపోయి యనట్లు జిల్లా కేంద్రాల వర్గాలు వెల్లడించాయి. టిబెట్ వైపు 16 మంది మరణించారు, 546 మంది తప్పిపోయారు. రెండు వైపులా కలిపి మృతులసుమారు 919, తప్పిపోయినవారు సుమారు 4,793గా నమోదైంది. మొత్తంగా 90 వేల మందికి పైగా వరద బాధితులయ్యారు. త్రిశూలి, చిలిమే, లాంగ్‌టాంగ్ ప్రాంతాల్లో జలవిద్యుత్ సొరంగాల్లో ఇంకా చిక్కుకున్నవారి కోసం నేపాల్ సైన్యం, భారత సొరంగ రక్షణ బృందం కలిసి వెతుకుతున్నాయి. సుమారు 90 మంది సొరంగాల్లో ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. భోటేకోసి నది నీటి మట్టం మళ్లీ పెరిగిందని చైనా వైపు నుంచి సమాచారం రావడంతో కొత్త వరద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. వర్షం, దెబ్బతిన్న రోడ్లు, వంతెనలు హెలికాప్టర్ల ద్వారా సహాయక, రక్షణ చర్యలను ఆలస్యం చేస్తున్నాయి. బాట్బుండు నుంచి రసువాగఢి, చైనా సరి హద్దు మార్గం పలు చోట్ల కొట్టుకుపోయింది. పునరుద్ధరణకు నెలలు పట్టవ చ్చు. దిగువ జిల్లాల్లో మృతదేహా లు కుళ్లిపోతుండటంతో సామూహిక అత్యేష్టియలు జరుగుతున్నాయి. గుర్తింపు కోసం డీఎన్ఏ పరీక్షలు మొదల య్యాయని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## ప్రజల ఆశీర్వాదంతో ప్రజాపాలనకు వెయ్యి రోజులు

మొదటి తరువాయి

36 వేల కోట్లు అందించామని, ఎకరానికి రూ. 12 వేలకు పెంచామని వెల్లడించారు. ధాన్యం కొనుగోళ్లు, సన్నవడ్లకు బోనస్‌తో గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేశామని తెలిపారు. వ్యవసాయ రంగానికి రూ. 1.75 లక్షల కోట్లు ఖర్చు చేసి రికార్డు సృష్టించామని, ఉచిత వ్యవసాయ విద్యుత్ కోసం రూ. 30 వేల కోట్లు, రైతుబీమాకు రూ. 3,500 కోట్లు, సన్నవడ్ల బోనస్‌కు దాదాపు రూ. 4 వేల కోట్లు కేటాయించామని చెప్పారు. పేదల సంక్షేమంలో భాగంగా గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రూ. 500కే ఎల్పీజీ సిలిండర్ అందిస్తున్నామని తెలిపారు. 16.32 లక్షల కొత్త రేషన్ కార్డులు జారీ చేసి, మొత్తం 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మందికి ప్రయోజనం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

యువతకు ఉద్యోగాలు.. విద్యకు పెద్దపీట :

తెలంగాణ యువతలో విశ్వాసం కలిగించేలా 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు చేపట్టామని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. యువత నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని, ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల్లో అల్పాహార ప్రారంభించడంతో పాటు 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని చెప్పారు.

సామాజిక న్యాయానికి తెలంగాణ దిక్సూచి :

బీసీ కులగణనతో సామాజిక న్యాయానికి పెద్దపీట వేశామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం చారిత్రాత్మక నిర్ణయమని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ప్రక్రియను పూర్తి చేయడం విప్లవాత్మక చర్యగా అభివర్ణించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిర్దేశించిన సామాజిక న్యాయ లక్ష్యానికి అనుగుణంగా తెలంగాణలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

## సర్' ద్వారా దేశ జనాభాను ఈసీ తగ్గిస్తున్నది

- ఢిల్లీలో 47 లక్షల ఓటర్ల పేర్లు తొలగింపుపై ఆప్ అధినేత ఆగ్రహం
- 'సర్' పేరుతో ఓటర్లను తగ్గిస్తున్నారని ఎన్నికల సంఘంపై విమర్శలు
- 1.45 కోట్ల ఓటర్లలో 97.53 లక్షల పేర్లే ముసాయిదా జాబితాలో
- జనాభా పెరుగుదలపై ఆందోళన అవసరం లేదంటూ కేజ్రీవాల్ వ్యంగ్యాస్త్రాలు
- '140 కోట్లను 50 కోట్లకు తగ్గించే శక్తి సర్‌కే ఉంది' అంటూ ఎక్స్‌లో వ్యాఖ్య
- జూన్ 30 నుంచి ఆగస్టు 7 వరకు సాగిన ప్రత్యేక సవరణ ప్రక్రియ
- 67 శాతం ఓటర్ల వివరాలే డిజిటలైజ్ చేసినట్లు ఈసీ వెల్లడి
- ఢిల్లీ ఓటర్ల జాబితాపై రాజకీయ దుమారం రేపిన ఆప్ ఆరోపణలు



న్యూఢిల్లీ

ఓటర్ జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) ప్రక్రియ ద్వారా దేశ జనాభాను ఎన్నికల సంఘం (ఈసీ) తగ్గిస్తున్నదని ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. దీంతో జనాభా పెరుగుదల గురించి ప్రభుత్వం ఆందోళన చెందడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. (ూతీజఱఅస ఖవయతీఅఖుశ్రీ) ఢిల్లీ ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి 47 లక్షలకు పైగా ఓటర్ల పేర్లను ఈసీ తొలగించడంపై అరవింద్ కేజ్రీవాల్ స్పందించారు. దేశ రాజధానిలోని సుమారు 1.5 కోట్ల మంది ఓటర్లలో 47 లక్షల పేర్లు గల్లంతయ్యాయని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని పరోక్షంగా విమర్శించారు. 'జనాభా పెరుగుదల గురించి ప్రభుత్వం ఆందోళన చెందకూడదు. ఎందుకంటే 'సర్' ప్రక్రియ ద్వారా దేశ జనాభాను 140 కోట్ల నుంచి 50 కోట్లకు ఎన్నికల సంఘం తగ్గించగలదు' అని ఎక్స్ పోస్ట్‌లో మండిపడ్డారు.కాగా, ఢిల్లీ ముసాయిదా ఓటర్ల జాబితాను సోమవారం విడుదల చేశారు. గతంలో నమోదైన మొత్తం 1,45,10,299 మంది ఓటర్లలో 47,56,722 మంది పేర్లు తొలగించారు. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఈ ముసాయిదా జాబితాలో 97,53,577 మంది ఓటర్ల వివరాలు ఉన్నాయి. ఢిల్లీలో జూన్ 30న ప్రారంభమైన 'సర్' ప్రక్రియ ఆగస్ట్ 7న ముగిసింది. ఢిల్లీలోని ఓటర్లలో సుమారు 67.18 శాతం మందికి సంబంధించిన వివరాల పత్రాలు సేకరించి డిజిటలైజ్ చేశారు.

## కృష్ణాజలాలపై సీఎం మౌనం..

మొదటి తరువాయి

తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే ఏపీ ప్రభుత్వం నీటి హక్కులపై దండెత్తి కృష్ణాజలాలను తరలిస్తున్నదని తెలిపారు. బీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టులు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జునసాగర్ కుడి కాలువ ఇప్పుడు వెలిగొండ ద్వారా ఏపీ ప్రభుత్వం నీటిని తరలిస్తున్నదని పేర్కొన్నారు. పాలమూరు, రంగారెడ్డి, నల్లగొండ సహా తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహం చేస్తున్నదని విమర్శించారు. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆర్ఎంబీ సైతం ప్రేక్షకపాత్ర వహించడం దుర్మార్గమని విమర్శించారు. తెలంగాణ నీటి హక్కులను ఎవరు కాపాడాలని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తక్షణమే స్పందించాలనీ, కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులను నింపి ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకం : హరీశ్‌రావు

రాష్ట్రంలో ఆడబిడ్డల భద్రత ప్రశ్నార్థకంగా మారిందని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి టి హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. గురుకులంలో చదివి పేదరికాన్ని జయించి నర్సుగా సేవలందిస్తున్న ఆడబిడ్డ దారుణహత్యకు గురికావడం తీవ్రంగా కలచివేసిందని సోమవారం ఎక్స్ ద్వారా ఆయన ట్వీట్ చేశారు. కాంగ్రెస్ పాలనలో ఆస్తులకే కాకుండా ప్రజల ప్రాణాలకూ భద్రత లేకుండా పోయిందని తెలిపారు. మహిళలకు భద్రత కల్పించలేని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హోం శాఖ నిర్వహించే నైతిక హక్కు ఉందా?అని ప్రశ్నించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాలనీ, నిందితుడికి వెంటనే శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


# విపక్షం విఫలం

మొదటి తరువాయి

ఏర్పాటు చేయాలని, 7వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఎదురుగానే అన్ని విషయాలు చెబుతానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణకు న్యాయం చేయాలని అనుకుంటే, నమ్మకం ఉంటే అసెంబ్లీకి కెసిఆర్ రావాలని ఆయన సూచించారు. 1,000 రోజుల్లో రూ.1.24 కోట్ల జీతం కెసిఆర్ తీసుకున్నారని, ప్రభు త్వ ఉద్యోగి ఏదైనా పాటు విధులకు రాకపోతే డిస్మిస్ చేస్తారని, మరి కెసిఆర్‌ను ఏం చేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత హోదాలో కెసిఆర్ భద్రత, వసతుల కోసం 21 కోట్లు రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసిందని సిఎం తెలిపారు. పదేళ్లలో కెసిఆర్ ఏం చేశారో, 1,000 రోజుల్లో తాము ఏం చేశామో అసెంబ్లీలో చర్చకు సిద్ధమని సిఎం సవాల్ విసిరారు. ఏనాడూ పదవిని దుర్వినియోగం చేయలేదని, చేయనని, తెలంగాణ ఉద్యమంలో కెసిఆర్ తాను ఒక్కడినేనని చెప్పి అధికారంలోకి రాగానే ఆ తర్వాత మొత్తం తన కుటుంబాన్ని దించి గుంపు మండలా జమ్మి మంది సొమ్ము తిన్నారని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. దేశంలో ఎవరైనా ప్రతిపక్ష నాయకుడు 1,000 రోజులు బయటకు రాకుండా ఉన్నారా..? అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రధాన ప్రతిపక్షం వైఫల్యం చెందిన రాష్ట్రం తెలంగాణ అని ఆయన ఆరోపించారు. మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. అనంతరం అంబర్‌పేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. నాకు, కెసిఆర్‌కు పోలిక లేదన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రి కాగానే ఆయన కొడుకు, అల్లుడిని మంత్రిని చేశారని, తాను ముఖ్యమంత్రి కాగానే పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిని మంత్రులు చేశానన్నారు. తాను సిఎం అయితే వి.హనుమంతరావును ప్రభుత్వ సలహాదారుడిగా చేశానని, అనిల్ యాదవ్‌ను ఎంపి చేశానని, అద్దంకి దయాకర్‌ను ఎంఎల్సి చేశానని తెలిపారు. అప్పట్లో కేటీఆర్ వెంకట్ రామిరెడ్డిని ఎమ్మెల్సీ చేస్తే, తాను అద్దంకి దయాకర్‌ను ఎమ్మెల్సీ చేశానన్నారు. కెసిఆర్ తన కొడుకును వర్కింగ్ ప్రెసిడెంట్ చేస్తే, తాను బలహీన వర్గాల బిడ్డ మహేష్‌కుమార్‌గౌడ్‌ను పిసిసి అధ్యక్షుడిగా చేశానని ఆయన తెలిపారు. 1,000 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ సమస్యను పరిష్కరించానని సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 1000 రోజుల్లో ఒక్కరోజైనా ప్రజలకు ఏం చేశారని కెసిఆర్‌ను ప్రశ్నించారు. మనవడు ఆస్పత్రికి వెళితే, బంధువులు ఎవరైనా చనిపోతే తప్ప బయటకు రాలేదని ఎద్దేవా చేశారు. కానీ తాను గంటైనా సెలవు తీసుకోలేదన్నారు. ఉద్యోగ సంఘాల సమస్యలను అర్థం చేసుకుంటూ ఉద్యోగ సంఘాల సమస్యలను తాను అర్థం చేసుకుంటూనని, 32 నెలల్లో ఎప్పుడైనా 1వ తేదీన జీతాలు ఇవ్వకుండా ఆపామా? ఉద్యోగులు ఆలోచించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. తుఫాన్ వచ్చినా, కరువు వచ్చినా ఒకటి తేదీనే జీతాలు పేశామని ముఖ్యమంత్రి తెలిపారు. ఆనాడు ఎలా ఉంది, ఈనాడు ఎలా ఉందో ఉద్యోగులు ఆలోచించాలన్నారు. ఐదున్నర లక్షల మంది ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఐదో తేదీనే జీతాలు ఇస్తున్నామని, గతంలో ఆరు నెలలకోసారి జీతాలు ఇచ్చేవారని గుర్తు చేశారు. రెండు నెలల్లో రూ.6 వేల కోట్ల రిటైర్‌మెంట్ బకాయిలను విడుదల చేశామని ఉద్యోగులు, వాళ్ల కుటుంబాలకు ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్దరించామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 2023 డిసెంబర్ 7వ తేదీన సిఎంగా ప్రమాణ స్వీకారం చేసి సచివాలయం వెళ్లి సమీక్ష చేస్తే 11 లక్షల మంది ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేదని అధికారులు చెప్పారన్నారు. ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాళా తీసిందని అధికారులు పేర్కొన్నారన్నారు. రూ.16 వేల కోట్ల మిగులుతో కాంగ్రెస్ పార్టీ కెసిఆర్‌కు తెలంగాణను అప్పగించిందని, ఏడాదికి రూ.6,500 కోట్లు వడ్డీ కింద చెల్లిస్తే సరిపోయేదని సిఎం తెలిపారు. తొమ్మిదిన్నర ఏళ్లలో ఒకే ఒక కుటుంబం 8 లక్షల 11 వేల కోట్ల అప్పుల్లో తెలంగాణను నిండా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 60 ఏళ్లలో 16 మంది ముఖ్యమంత్రులు 70 వేల కోట్ల అప్పు చేస్తే కెసిఆర్ ఒక్కరే తొమ్మిదిన్నర ఏళ్లలో ఏడున్నర లక్షల కోట్ల అప్పు చేశారని, నెలకు రూ.7,500 కోట్లు అసలు, వడ్డీ చెల్లించాల్సి వస్తోందన్నారు. అంబర్‌పేటలో పదేకరాల్లో పేదలకు ఇళ్లు కట్టిస్తున్నామని సిఎం తెలిపారు.

# భారత్-రష్యా బంధానికి కొత్త బలం

**-మోదీ--పుతిన్ భేటీ**
**-బిష్కెక్ లో ఎస్సీవో సదస్సు సందర్భంగా కీలక ద్విపాక్షిక చర్చలు..**
**-ఇంధనం, ఎరువులు, రక్షణ, వాణిజ్యం, చెల్లింపుల వ్యవస్థలపై ఫోకస్**
**-యూపీఐ వంటి డిజిటల్ చెల్లింపుల అవకాశాలపైనా ఆసక్తి..**
**--మారుతున్న ప్రపంచ పరిణామాల మధ్య ప్రాధాన్యం సంతరించుకున్న భేటీ**



న్యూఢిల్లీ :

కిర్గిజిస్తాన్ రాజధాని బిష్కెక్ లో సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ద్విపాక్షికంగా సమావేశమయ్యారు. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా జరిగిన ఈ భేటీపై అంతర్జాతీయంగా ఆసక్తి నెలకొంది. భారత్-రష్యా సంబంధాల్లో కీలకమైన ఇంధనం, ఎరువులు, రక్షణ, వాణిజ్యం, చెల్లింపుల వ్యవస్థలు వంటి అంశాలపై ఇరువురు నేతలు దృష్టి సారించారు. ప్రపంచ రాజకీయాల్లో వేగంగా మారుతున్న పరిణామాలు, ఇంధన మార్కెట్లో అనిశ్చితి, రష్యాపై కొనసాగుతున్న పాశ్చాత్య ఆంక్షలు, భారత్-రష్యా వాణిజ్యంలో పెరుగుతున్న అసమానతల నేపథ్యంలో మోదీ--పుతిన్ భేటీకి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది.

ఇంధన భద్రతకు రష్యా కీలకం : భారత్ కు రష్యా ఇంధన రంగంలో కీలక భాగస్వామిగా కొనసాగుతోంది. ముఖ్యంగా రష్యా నుంచి ముడిచమురు దిగుమతులు భారత్ ఇంధన భద్రతకు ప్రాధాన్యంగా మారాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు, సరఫరా మార్గాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు మారుతున్న సమయంలో రష్యా నుంచి స్థిరమైన ఇంధన సరఫరాను కొనసాగించడం భారత్ కు ముఖ్యమైన అంశం. చమురు, గ్యాస్ సరఫరా, దీర్ఘకాలిక ఇంధన సహకారం వంటి అంశాలు మోదీ--పుతిన్ చర్చల్లో ప్రాధాన్యం పొందినట్లు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి.

ఎరువుల సరఫరాపైనా దృష్టి :

భారత వ్యవసాయ రంగానికి అవసరమైన ఎరువుల సరఫరా కూడా భారత్--రష్యా సంబంధాల్లో కీలకమైన అంశంగా మారింది. దేశీయ రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడటంతో పాటు, అంతర్జాతీయ సరఫరా గొలుసుల్లో ఎదురయ్యే అంతరాయాలను అధిగమించేందుకు రష్యాతో సహకారం భారత్ కు అవసరం. ఇంధనంతో పాటు ఎరువుల దిగుమతులు కూడా భారత్ కు వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగినవే. అందువల్ల భవిష్యత్ లో ఎరువుల సరఫరాను స్థిరంగా కొనసాగించే అంశం ఈ భేటీలో ప్రాధాన్యం పొందింది.

రక్షణ రంగంలోనూ కీలక భాగస్వామ్యం :

భారత్--రష్యా సంబంధాలకు రక్షణ సహకారం దశాబ్దాలుగా ప్రధాన ఆధారం. భారత సైనిక వ్యవస్థలో రష్యా తయారీ పరికరాలు, ఆయుధ వ్యవస్థలకు గణనీయమైన ప్రాధాన్యం ఉంది. రక్షణ పరికరాల నిర్వహణ, విడిభాగాల సరఫరా, సాంకేతిక సహకారం, సంయుక్త తయారీ, భవిష్యత్ రక్షణ ఉత్పత్తి వంటి అంశాలు ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యంలో కీలకంగా ఉన్నాయి. ప్రత్యేకంగా ఎస్-400 వాయురక్షణ వ్యవస్థకు సంబంధించిన సహకారం, రష్యా రక్షణ సాంకేతికతతో భారత్ సంబంధాలు వంటి అంశాలు కూడా విస్తృతంగా చర్చకు వస్తున్నాయి. అయితే ఏదైనా కొత్త రక్షణ ఒప్పందం కుదిరిందని అధికారిక ప్రకటన వెలువడితేనే దానిని భారమైన నిర్ణయంగా పేర్కొనడం సముచితం.

వాణిజ్యం పెరిగినా.. లోటు మాత్రం భారీగా :

భారత్--రష్యా ద్విపాక్షిక వాణిజ్యం ఇటీవల కాలంలో భారీగా పెరిగింది. రష్యా నుంచి భారత్ భారీగా ముడిచమురు దిగుమతి చేసుకోవడం ఇందుకు ప్రధాన కారణం. అయితే వాణిజ్యం పెరుగుతున్నప్పటికీ భారత్ కు రష్యాతో వాణిజ్య లోటు కూడా గణనీయంగా పెరిగింది. మొత్తం ద్విపాక్షిక వాణిజ్యం 100 బిలియన్ డాలర్లను దాటినప్పటికీ, భారత వాణిజ్య లోటు 53 బిలియన్ డాలర్లకు పైగా ఉందని తాజా విశ్లేషణలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో రష్యాకు భారత ఎగుమతులను పెంచడం భారత్ కు కీలక లక్ష్యంగా మారింది. ఔషధాలు, ఇంజనీరింగ్ ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల్లో రష్యా మార్కెట్ ను మరింతగా ఉపయోగించుకోవాలని భారత్ చూస్తోంది.

## టీవీకే-కాంగ్రెస్ మధ్య విబేధాలు..

**ప్రధానిగా రాహుల్‌కు విజయ్ మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ పట్టు**
**మద్దతు లేకుంటే మంత్రి పదవులకు రాజీనామా చేస్తామని హెచ్చరిక**
**విజయ్‌ను జాతీయ నాయకుడిగా ప్రాజెక్ట్ చేస్తున్న టీవీకే నేతలు**
**కూటమి బలంపై కాంగ్రెస్ వ్యాఖ్యలు.. రాజకీయంగా వేడెక్కిన తమిళనాడు**



తమిళనాడులో విజయ్ ఆధ్వర్యంలోని టీవీకే కూటమి అధికారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ కూటమిలో కాంగ్రెస్ ప్రధాన భాగస్వామిగా ఉంది. అయితే, ఇప్పుడు ఈ కూటమిలో విబేధాలు చోటు చేసుకున్నాయి. ప్రధాని అభ్యర్థి విషయంలో కాంగ్రెస్, టీవీకే పార్టీల మధ్య వివాదం నడుస్తోంది. 2029లో ప్రధాని అభ్యర్థిగా రాహుల్ గాంధీకి విజయ్ మద్దతు ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది.లేదంటే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తానని కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రి ఎస్.రాజేశ్ కుమార్ హెచ్చరించారు. తనతోపాటు పి.విశ్వనాథన్ కూడా మంత్రి పదవికి రాజీనామా చేస్తారని ఆయన అన్నారు. దీనికి కారణం ఉంది. 2029లో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో విజయ్ ప్రధాని అభ్యర్థిగా ఉంటారంటూ టీవీకే నేతలు తమిళనాడులో ప్రచారం చేస్తున్నారు. విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా ఆ పార్టీ నేతలు బలపరుస్తున్నారు. పైగా ఇటీవల ఒక జాతీయ మీడియా సంస్థ నిర్వహించిన సర్వేలో విజయ్‌న ప్రధాని అభ్యర్థిగా 9 శాతం మంది అంగీకరిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో విజయ్‌కు మద్దతు పెరిగింది. ఇదే కాంగ్రెస్ పార్టీకి ఆగ్రహం తెప్పిస్తోంది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అగ్రనేత అయిన రాహుల్ గాంధీకి ఉన్న ఇమేజ్ దృష్ట్యా 2029 ఎన్నికల్లో ఆయనే ప్రధాని అభ్యర్థి అని కాంగ్రెస్ ఎప్పటినుంచో ప్రచారం చేస్తోంది. దేశానికి కాబోయే ప్రధాని రాహులే అంటూ ఎప్పటినుంచో చెబుతోంది. అలాంటిది, తమిళనాడులో టీవీకే విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా చూపెడుతుండటంపై కాంగ్రెస్ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ వల్లే తమిళనాడులో విజయ్ సీఎం అయ్యారని, ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేసుకోగలిగారని కాంగ్రెస్ అంటోంది. రాహుల్‌కు మద్దతు ఇవ్వకపోతే కూటమిలో కొనసాగబోమని, మంత్రి పదవులకు రాజీనామా చేస్తామని ఆ పార్టీ నేతలు హెచ్చరిస్తున్నారు.

## అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

**కెనడా దారుణమైన దుర్వినియోగదారు**
**కెనడాలో ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి**
**ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు**



వాషింగ్టన్,

అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లుకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా-కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించారు.----

## బహుజన తెలంగాణ కావాలి

మొదటి తరువాయి



సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాలు బాగుపడాల్సిన అవసరముందని అందుకోసం సామాజిక న్యాయ తెలంగాణ అవసరమని చెప్పారు. తెలంగాణ ప్రజల కోసం 20 ఏళ్లు కష్టపడి పనిచేస్తే బీఆర్ఎస్ నుంచి నిర్ధాక్షణ్యంగా వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పదవుల కోసం పార్టీ పెట్టలేదని తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు కోసం పంతం పట్టి పార్టీ పెట్టానని అన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన 4 నెలల తర్వాత సొంతూరు నిజామాబాద్ కు రావటం సంతోషంగా ఉందని కవిత అన్నారు. గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీ ఏ విధంగా ఆశీర్వాదం ఇచ్చారో ఇప్పుడు కూడా అదే ఆశీర్వాదం ఇవ్వాలని కవిత నిజామాబాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సొంత గడ్డపై సొంత మనుషులను చూసి భావోద్వేగానికి లోనైన కవిత తెలంగాణ సాధించుకున్న తర్వాత ప్రజల జీవితాల్లో అనుకున్న స్థాయిలో మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బంగారు తెలంగాణ అని చెప్పిన బీఆర్ఎస్ హయాంలో నలుగురి ఇండ్లు మాత్రమే బంగారం మాయం అయ్యాయని చెప్పారు. ప్రజల కోసం ఇంకా చేయాల్సింది చాలా ఉందన్నారు. బంగారు తెలంగాణ కాదు, ఇప్పుడు కావాల్సింది బహుజన తెలంగాణ అని కవిత అన్నారు. ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాల్సి ఉందన్నారు. అందుకోసం చిత్తశుద్ధితో పనిచేసేందుకే తాను పార్టీ పెట్టానన్నారు. పదవుల కోసమైతే ఏ రాజకీయ పార్టీలోకైనా వెళ్లవచ్చని...కానీ తాను చూడని పదవులు లేవన్నారు. ప్రజల జీవితాల్లో మార్పు రావాలన్న పతంతోనే నేను పార్టీ పెట్టానన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన 4 నెలల తర్వాత తన సొంతగడ్డ నిజామాబాద్ కు రావటం సంతోషంగా ఉందని చెప్పారు. సొంత గడ్డపై సొంత మనుషులను చూసి కవిత భావోద్వేగానికి లోమయ్యారు. ఎంత ఆపుకుందామనుకున్న కన్నీళ్లు ఆగటం లేదంటూ ఈ సందర్భంగా ఆమె అన్నారు. అలాగని తనను పిరికిదాన్ని అనుకోవద్దని... ఆడబిడ్డల గుండెల్లో బాధ ఉంటే కన్నీళ్లు వస్తాయని చెప్పారు. ఇక గతంలో ఎంపీగా, ఎమ్మెల్సీ గెలిపించి తనను ఎలా ఆశీర్వదించారో అదే విధంగా తనకు ఆశీర్వాదం ఇవ్వాలని ప్రజలను కోరారు. ఏ తప్పు చేయకున్న సరే తీహార్ జైల్లో పెట్టినప్పటికీ ధైర్యం సడలలదేని, దారి తప్పలేదని కవిత గుర్తు చేసుకున్నారు. అప్పుడే తాను తప్పు చేయలేదని, నిజామాబాద్ నిప్పు బిడ్డనని చెప్పానని అన్నారు. ఈడీ, సీబీఐ తనను ఇబ్బంది పెట్టిన సమయంలో అండగా ఉండాల్సిన బీఆర్ఎస్ పార్టీ నిర్ధాక్షణ్యంగా తనను బయటకు పంపించిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పై కక్షతో తనను అరెస్ట్ చేశారని చెప్పిన బీఆర్ఎస్ పెద్దలు ఆ తర్వాత ఎందుకు మాట్లాడలేదని ఆమె ప్రశ్నించారు. బీఆర్ఎస్ నుంచి బయటకు పంపిన సరే తాను ప్రజల కోసం పనిచేయాలని నిర్ణయించుకున్నానని అందుకే పార్టీ పెట్టానని కవిత చెప్పారు.

# పోచమ్మ తల్లి బోనాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి





**ఆమనగల్లు, ఆగస్టు 31(నేటి దర్శిని);**
ఆమనగల్లు పట్టణ కేంద్రంలో మాల కుల బాంధవుల ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి, బోనాలను సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. బోనాల సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను నెత్తిన ఎత్తుకుని అమ్మవారికి సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవంలో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రజలంతా ఐక్యంగా పండుగలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. పోచమ్మ తల్లి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ఆమనగల్లు ప్రాంతం సుభిక్షంగా అభివృద్ధి చెందాలని కోరుకున్నారు. కార్యక్రమంలో మాల కుల బాంధవులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువత, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. ఉత్సవం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పోలీసు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్,సీఐ వెంకటేశ్వర్లు,పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, కౌన్సిలర్ యనమల రమేష్, కాలే మల్లయ్య, చెన్నకేశవులు, పట్టణ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## జూరాల డ్యామ్ వద్ద కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఘన స్వాగతం



- 200 మందికి పైగా బీజేపీ కార్యకర్తలతో హాజరైన రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి
- నారాయణపేటలో నూతన ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి



**మిడ్జిల్, నారాయణపేట, ఆగస్టు 31, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
మక్తల్ నియోజకవర్గం అమరచింత మండలంలోని జూరాల డ్యామ్ వద్ద కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కి, మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణమ్మ కి బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమరచింత, ఆత్మకూర్, నర్వ, మాగనూర్ మండలాల నుంచి తరలివచ్చిన 200 మందికి పైగా బీజేపీ కార్యకర్తలతో కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ డీకే అరుణమ్మలకు ఘన స్వాగతం తెలిపారు. కార్యకర్తలతో కలిసి కేంద్ర మంత్రికి, ఎంపీకి అభినందనలు తెలియజేశారు. అనంతరం నారాయణపేట జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ రతంగ్ పాండ్ రెడ్డి నూతనంగా నిర్మించిన ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణమ్మలతో కలిసి డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన ఆసుపత్రిని నిర్మించిన శ్రీ రతంగ్ పాండ్ రెడ్డి గారిని, వారి కుటుంబ సభ్యులను డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి అభినందించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

## అంకాలమ్మ తల్లి సేవలో జాలే బ్రదర్స్



- చిత్రియాలలో ఘనంగా దేవిని సేవ కార్యక్రమాలు
- ప్రజల సుఖసంతోషాలు, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక పూజలు



**చందంపేట, ఆగస్టు 31 (నేటి దర్శిని) :**
చందంపేట మండలం చిత్రియాల గ్రామంలో శ్రీశ్రీశ్రీ చిత్రియాల అంకాలమ్మ తల్లి వారి దేవిని సేవ కార్యక్రమాలు సోమవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ వేడుకల్లో భాగంగా తొలి రోజు సేవ సందర్భంగా జాలే బ్రదర్స్ నరసింహారెడ్డి, తిలక్‌రెడ్డి స్వగృహానికి విచ్చేసిన అంకాలమ్మ తల్లిని దర్శించుకుని కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలుఅంకాలమ్మ తల్లికి జాలే బ్రదర్స్ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా దేవరకొండ నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. సకాలంలో వర్షాలు కురవాలని మొక్కులు సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు కళకళలాడాలని, రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని అంకాలమ్మ తల్లిని ప్రార్థించినట్లు జాలే బ్రదర్స్ తెలిపారు. నియోజకవర్గ ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. భక్తులతో సందడిగా చిత్రియాలమూడు రోజుల పాటు జరిగే దేవిని సేవ కార్యక్రమాలతో చిత్రియాల గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. తొలి రోజు కార్యక్రమానికి భక్తులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, జాలే బ్రదర్స్ కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి

- ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అరుణ్ కుమార్



**ఆమనగల్లు, ఆగస్టు 31(నేటి దర్శిని);**
జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతానికి పనిచేయాలని మండల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అరుణ్ కుమార్ పేర్కొన్నారు.
సెప్టెంబర్ 12న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో సోమవారం సాయంత్రం ఆమనగల్లు కోర్టులో సమన్వయ సమావేశం నిర్వహించారు. మేజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి అరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, సీడీఓ అధికారులు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్, ఆమనగల్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ హాజరయ్యారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు అనువైన కాంపౌండబుల్ కేసులు, అడ్మిషన్ కేసులు, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పీటీ కేసులను గుర్తించాలని మేజిస్ట్రేట్ సూచించారు. సంబంధిత పక్షాలతో సమన్వయం చేసుకుని వీలైనన్ని ఎక్కువ కేసులను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.కేసుల త్వరిత పరిష్కారానికి పోలీస్, ప్రాసిక్యూషన్, ఎక్సైజ్, న్యాయ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

## 100% సబ్సిడీ వేరుశనగ విత్తనాలు.. రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు, ఆగస్టు 31(నేటి దర్శిని);**
జాతీయ ఆహార నూనెల మిషన్--నూనెగింజలు (NMEO--Oilseeds) పథకం కింద ఆమనగల్ రైతు వేదికలో సోమవారం కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్ మండలాల రైతులకు 100 శాతం సబ్సిడీపై వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలను వినియోగించడం ద్వారా పంట దిగుబడి, రైతుల ఆదాయం పెరిగే అవకాశం ఉందన్నారు. ఆమనగల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని మూడు మండలాల్లో సుమారు 2,500 ఎకరాలకు 2,000 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలను సబ్సిడీపై అందించడం ద్వారా నూనెగింజల సాగును ప్రోత్సహించడమే లక్ష్యమని పేర్కొన్నారు. రైతులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఏడీఏలు పద్మజ, శోభారాణి, తలకొండపల్లి ఏవో రేణుక చక్రవర్తి, ఆమనగల్ ఏవో శ్రీనివాస్‌గౌడ్, కడ్తాల్ ఏవో కవిత, ఏఈవోలు పాల్గొన్నారు. అలాగే ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్, వైస్ చైర్మన్ గీతా ఆచారి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, తలకొండపల్లి పీఏసీఎస్ చైర్మన్ కేశవరెడ్డి, మూడు మండలాల సర్పంచులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

- పాల్గొన్న మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు



**ఆమనగల్, ఆగస్టు 31(నేటి దర్శిని):**
రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణం లోని మాల కుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా పోచమ్మ దేవాలయాన్ని పచ్చటి తోరణాలతో, రకరకాల పూల మాలలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయంలో పూజారి మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ళ నుంచి బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ యనమల్ల రమేష్, మాజీ కౌన్సిలర్ చెన్నకేశవులు, గ్రామ ముఖ్య నాయకులు కాలే మల్లయ్య, దేవేందర్ ,చంద్రయ్య, మల్లేష్,సతీష్,మల్లయ్య, మహిళా భక్తులు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# స్మశానవాటికలో క్షుద్రపూజలు

**-కాలుతున్న శవం నుంచి మాంసం తిన్న మంత్రగత్తె**

**భోపాల్ : (నేటి దర్శిని)**
ఒక మంత్రగత్తె స్మశానవాటికలో క్షుద్రపూజలు చేసింది. చితిపై కాలుతున్న శవానికి చెందిన మాంసాన్ని ఆమె తిన్నది. తాము ఇలాగే చేస్తామని ఆ తాంత్రికురాలు పేర్కొన్నది. ఈ భయానక వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినీ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక స్మశానంలో కాలుతున్న చితి వద్ద ఒక మంత్రగత్తె తాంత్రిక పూజలు చేస్తున్నట్లు కనిపించింది. కాళీనంద్ గిరిగా గుర్తించిన ఆమె ఒళ్లంతా బూడిద పూసుకుని, నల్లని వస్త్రం ధరించింది. ఒరలోంచి కత్తిని బయటకు తీసి మండుతున్న చితిలో ఎముకలు, పుర్రె, మాంసం



కోసం వెతికింది. కాలుతున్న శవానికి చెందిన ఒక మాంసం ముద్దను బయటకు తీసి తిన్నది. 'చూడండి. ఇది చాలా వేడిగా ఉన్నది. ఇప్పుడే మంటల నుంచి బయటకు తీశాను. ఇది రుచిగా ఉంటుంది. నాకు తెలిసిన చాలా మంది తాంత్రికులను చంపేశాను. నా విషయంలో జాగ్రత్తగా ఉండండి' అని ఆమె హెచ్చరించింది.కాగా, బూడిద పూసుకోవడం, మనుషుల పుర్రెలతో ఆడటం వంటివి తమ పని అని ఆ తాంత్రికురాలు తెలిపింది. 'మా గురించి మీకు తెలిసే ఉంటుంది. మేం మనుషులను ఇలాగే తింటాం. ఇదే మా జీవితం. మేం ఏమేమి చేస్తామో మీరు కనీసం ఊహించలేరు కూడా' అని ఆమె అన్నది. చివరలో ఒక మంత్రాన్ని కూడా ఆ మంత్రగత్తె జపించింది. అయితే ఈ సంఘటన ఏ స్మశానవాటికలో, ఎప్పుడు జరిగింది అన్నది తెలియలేదు. మరోవైపు ఆ తాంత్రికురాలి వికృత చర్యకు సంబంధించిన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఒక ఆచారంలో భాగంగా చితిపై కాలుతున్న మృతదేహాన్ని ఆమె విచ్ఛిన్నం చేసి, మానవ మాంసాన్ని తినడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరుపాలని చాలా మంది డిమాండ్ చేశారు.

# అస్సాం జైళ్లలో..
# 200కు పైగా హెచ్ఐవీ కేసులు

**గువాహతి : (నేటి దర్శిని)**
అస్సాంలోని పలు జైళ్లలో 200కు పైగా హెచ్ఐవీ కేసులు నమోదయ్యాయి. ఎయిడ్స్ సోకిన ఖైదీలకు యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్టీ) చికిత్స అందిస్తున్నారు. అయితే అస్సాంలోని జైళ్లలో హెచ్ఐవీ కేసుల సంఖ్య పెరుగడం ఆందోళన కలిగిస్తున్నది. ఆ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 31 జైళ్లలోని ఖైదీలకు హెచ్ఐవీ స్క్రీనింగ్ నిర్వహించారు. గత నాలుగు నెలల్లో 226 మంది ఖైదీలకు ఎయిడ్స్ సోకినట్లు నిర్ధారణ అయ్యింది. గత వారం శ్రీభూమి జిల్లా జైలులో హెచ్ఐవీ పాజిటివ్ ఖైదీల సంఖ్య పెరిగింది. ప్రస్తుతం ఈ జైలులో 445 మంది ఖైదీలు ఉండగా వారిలో 11 మందికి హెచ్ఐవీ పాజిటివ్‌గా నిర్ధారణ



అయింది. ఈ 11 మందిలో ఒక మహిళా ఖైదీ కూడా ఉన్నట్లు తెలుస్తున్నది. తాజాగా శ్రీభూమి జిల్లా జైలులో హెచ్ఐవీ కేసులు బయటపడటం జిల్లా వ్యాప్తంగా ఆందోళన రేకెత్తించింది.కాగా, అస్సాం జైళ్లలో హెచ్ఐవీ సోకిన 95 శాతం మంది ఖైదీలు ఇంజెక్షన్ ద్వారా మాదకద్రవ్యాలు తీసుకున్నవారేనని అధికారులు తెలిపారు. 31 జైళ్లలోని హెచ్ఐవీ పాజిటివ్‌గా ఉన్న 226 మంది ఖైదీలలో 202 మంది యాంటీ రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్టీ) చికిత్స పొందుతున్నట్లు వివరించారు. మరోవైపు అస్సాం జైళ్లలోని ఖైదీలకు హెచ్ఐవీ సోకడం ఆందోళన కలిగిస్తున్నదని ముఖ్యమంత్రి హిమంత బిస్వా శర్మ తెలిపారు. జైళ్లలోని ఖైదీలకు మరిన్ని వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం యోచిస్తున్నదని చెప్పారు. అస్సాంలో సుమారు 33,000 మంది హెచ్ఐవీ లేదా ఎయిడ్స్ రోగులు ఉన్నారని ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి అశోక్ సింఘాల్ వెల్లడించారు.

# ఆడవాళ్లు ఇంటికే పరిమితం కావాలి

**కేరళలో ముస్లిం మత గురువు వివాదాస్పద వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ : (నేటి దర్శిని)**
మహిళల గురించి కేరళకు చెందిన ఒక ముస్లిం మతగురువు వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఆడవాళు ఇంటికే పరిమితం కావాలని సూచించాడు. మత గురువు, కాంతాపురం సమస్త కేరళ జామియ్యతుల్ ఉలామా జనరల్ సెక్రెటరీ ఏపీ అబూబాకర్ ముస్లియార్ ఆదివారం ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఆదివారం కోచిలోని, కాంతాపురంలో ఒక మత సంబంధమైన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారుగతవారం ఈ సంస్థ తరఫున ఒక ఆదేశం జారీ చేశారు. దీని




ప్రకారం.. మహిళలు మత పరమైన కార్యక్రమాలు, ఇతర వేడుకల్ని నాలుగు గోడల మధ్య, ఇంట్లోనే నిర్వహించుకోవాలి. మగవారితో కలిసి మహిళలు ఎలాంటి బహిరంగ వేదిక పంచుకోకూడదు. అలాగే, ప్రజలకు సంబంధించిన బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనకూడదు. అయితే, ఈ ప్రకటనపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కేరళకు చెందిన పలువురు మహిళా నేతలు ఈ ప్రకటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు బయటకు రాకుండా ఉండేలా ఆదేశించడంపై మండిపడ్డారు. ఇప్పుడు ఇదే అంశంపై ఆ ముస్లిం సంస్థకు చెందిన మత గురువు అబూబాకర్ స్పందించాడు. ఈ ఆదేశాల్ని సమర్థించాడు. మహిళలు ఇంటికే పరిమితం కావాలని సూచించాడు. మగవారితో బహిరంగ వేదుకల్ని పంచుకోకూడదన్నాడు. వారు బయటకు రావడం వల్ల భారీ వినాశనం సంభవిస్తుందని, దానిని నివారించేందుకే పరదాల్ని సూచించిందని అబూబాకర్ వ్యాఖ్యానించాడు. ఇలాంటి విషయాలు చెప్పడంలో తమను ఎవరూ ఆపలేరని అతడు అన్నాడు. తాము ఎన్నో ఏళ్లుగా మతాన్ని అనుసరిస్తున్నామని, అందువల్ల తమకు అలా చెప్పే అధికారం ఉందని వివరించాడు. అయితే, అతడి వ్యాఖ్యలపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఢిల్లీలో దారుణాలు.

**-మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి..**
**-బస్సులో యువతిపై గ్యాంగ్ రేప్**

**న్యూఢిల్లీ : (నేటి దర్శిని)**
దేశ రాజధాని ఢిల్లీలో దారుణ ఘటనలు జరిగాయి. కదిలే బస్సులో యువతిపై నిర్భయ తరహా అత్యాచార ఘటన జరిగింది. మరో ఘటనలో ఒక స్కూల్‌లో మూడేళ్ల చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. ఈ రెండు ఘటనలకు సంబంధించిన వివరాలివి.

**మూడేళ్ల చిన్నారిపై స్కూల్ బస్సు డ్రైవర్..**
ఢిల్లీలోని బవానా ప్రాంతంలోని ఒక ప్రైవేటు స్కూల్‌లో నర్సరీ చదువుతున్న చిన్నారిపై లైంగిక దాడి జరిగింది. ఈ దారుణానికి పాల్పడింది బస్సు స్కూల్ డ్రైవర్. మూడేళ్ల నర్సరీ విద్యార్థిని మర్మావయవాలపై గాయాలుండటాన్ని ఆగష్టు 19న చిన్నారి తల్లిదండ్రులు గుర్తించారు. దీంతో ఆ గాయాలు ఎలా అయ్యాయని చిన్నారిని తల్లిదండ్రులు అడిగారు. స్కూల్‌లో ఒక బ్యాడ్ అంకుల్ తనకు రోజూ చాక్లెట్లు ఇచ్చి, ఇబ్బంది పెడుతున్నాడని చెప్పింది. దీంతో చిన్నారి తల్లిదండ్రులకు జరిగిన విషయం అర్థమైంది. వెంటనే వారు పోలీసులకు, స్కూల్ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఆ పాపకు ఇంకా మాటలు కూడా సరిగ్గా రావు. ఆ చాక్లెట్లు ఇచ్చిన అంకుల్ ఎవరో చిన్నారి గుర్తించలేదు. అతడి గురించి స్పష్టమైన వివరాలు చెప్పలేకపోయింది. అయితే, స్కూల్‌లో పని చేసే సిబ్బందికి సంబంధించి సీసీటీవీ వీడియో దృశ్యాలు, ఫొటోగ్రాఫ్‌లు చూపించారు. వాటిలో నిందితుడిని ఆ చిన్నారి గుర్తించింది. నిందితుడిని బస్సు డ్రైవర్ వికాస్‌గా గుర్తించారు. చిన్నారి వాష్‌రూమ్‌కు వెళ్లిన సమయంలో పాప వెంటే వెళ్లేవాడు. చాక్లెట్ల ఆశచూపి, అక్కడి **మెట్లకిందికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు.**



గతంలో నాలుగుసార్లు అలా చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడ్డట్లు తేలింది. గతంలో కూడా పలువురు చిన్నారులకు నిందితుడు చాక్లెట్లు ఇవ్వడం అక్కడి సీసీ కెమెరాల్లో రికార్డైంది. దీంతో ఆ ఘటనలపై కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. పాప ద్వారా నిందితుడిని గుర్తించిన పోలీసులు.. స్కూల్ ఆవరణలోనే వికాస్‌ను అరెస్టు చేశారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**కదిలే బస్సులో 16 ఏళ్ల యువతిపై**
మరో ఘటనలో.. కదిలే బస్సులో 16 ఏళ్ల యువతిపై సామూహిక అత్యాచారం జరిగింది. ఢిల్లీలోని కాశ్మీరే గేట్ ఏరియాలోని ఖాళీగా ఉన్న ఒక స్లీపర్ బస్సులో ఈ ఘటన ఆగష్టు 4న జరిగింది. ఉత్తర ప్రదేశ్‌లోని మణిపురి జిల్లాకు చెందిన 16 ఏళ్ల యువతి ఇంటి నుంచి చెప్పకుండా బయటకు వచ్చేసింది. తన ఊరు నుంచి నోయిడాలోని తన బంధువు దగ్గరికి వెళ్లాలనుకుంది. ఈ క్రమంలో ఒక బస్సు ఎక్కింది. అయితే, వర్షం, చీకటి కారణంగా మధ్యలోనే పారి చౌక్ ప్రాంతంలో పొరపాటున దిగేసింది. ఇదే సమయంలో అటు నుంచి ఒక స్లీపర్ బస్సు వెళ్తూ కనిపించింది.
దీంతో ఆ బస్సును ఆపాల్సిందిగా యువతి సిగ్నల్ ఇచ్చింది. యువతి ఒంటరిగా ఉండటాన్ని ఆసరాగా చేసుకున్న బస్సు, డ్రైవర్.. తాము కూడా నోయిడాలోని సెక్టార్ 63కే వెళ్తున్నామని చెప్పారు. ఆమెను కావాల్సిన చోట దింపుతామని చెప్పి బస్సులో ఎక్కించుకున్నారు. యువతి బస్సు ఎక్కిన తర్వాత ఆమెపై బస్సు కండక్టర్, తర్వాత డ్రైవర్.. ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించారు. అత్యాచారం అనంతరం యువతిని కాశ్మీర్ గేట్ సమీపంలో దింపేసి వెళ్లిపోయారు. అనంతరం బాధిత యువతి.. పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు బస్సు డ్రైవర్ కుల్దీప్, కండక్టర్ సందీప్‌ను అరెస్టు చేశారు. బస్సును సీజ్ చేశారు.

## సంపాదకీయం

# ఏకత విరుద్ధ కథ



'అందరూ ఆచరణలో నిమగ్న మయ్యే ఉంటారు. కానీ ఆలోచనలూ మాటలే వారిననుసరించవు" అని అంటా రొక కవి. ఇది తిరగేసి వ్యంగ్యంగా చెప్పిన మాట. అంటే, చెప్పేదానికి చేసేదానికి పొంతన ఉండదని అర్థం. మాటలకు చేతలకు చాలా వ్యత్యాసం ఉంటుందనేది ఎప్పటినుంచో మనకు తెలిసిన విషయమే. అందుకే అంటారు, 'మాటలు కోటలు దాటుతాయి, కాని చేతలు గడపలు దాటవు అని.' 'వట్టి మాటలు కట్టి పెట్టోయ్, గట్టి మేల్ తలపెట్టవోయ్' అన్న గురజాడ గీతం ఇలాంటి వారిని చూసే రాసుంటారు. అయితే చెప్పే మాటల ప్రకారం చేయకపోతే పోనీ, చెప్పినదానికి విరుద్ధంగా, పూర్తి వ్యతిరేకంగా చేస్తున్న వారి గురించి జాగ్రత్తగా ఆలోచించాల్సిన అవసరం ఉంది. అదేమంటే, 'సార్వత్రిక ఏకతా ఉత్సవాల' పేరుతో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నిర్వహిస్తున్న సభలు నేడు అమెరికా దేశపు న్యూయార్క్ సిటీలోనూ ఏర్పాటు చేస్తున్నారు. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ గార్డెన్‌లో ఆగస్టు 29 న జరిగే ఈ సభలో ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగిస్తున్నారు. సార్వత్రిక ఏకతా ఉత్సవమని దానికి పేరుపెట్టటం మరీ విడ్డూరంగా ఉంది. అయితే వారి ఏకత కేవలం మతపరమైన ఏకతకు సంబంధించింది కావచ్చు. వీళ్లు అసలు మనుషుల ఐక్యతను ఎప్పుడూ కోరుకోరు. వీరి సిద్ధాంతంలోనే విభజన, విద్వేషం ఉంటుంది. ఐక్యత, ఏకత అనే మాటలకే పూర్తి విరుద్ధమైన ఆచరణ వాళ్లది. అట్లాంటి వాళ్లు సార్వత్రిక ఏకత కోసం ఉత్సవం చేస్తున్నారు. సరే వారి అర్థంలో విద్వేషాలను, విభజనను వెళ్లగక్కటానికి కావలసిన ఏకత కోసం ఈ పాట్లన్నీ పడుతున్నారు. కాబట్టే ఏ మాటల వెనుక ఏ అర్థాలు దాగున్నాయో తెలుసుకోనంతవరకు మోసపోతూనే ఉంటాం. ఇప్పుడు ముసుగేసుకున్న ఆ సంఘ్ ఏర్పడి వందేండ్లు నిండిన సందర్భంగా ప్రపంచంలోనూ తమ గళాన్ని, గరళాన్ని చిందించే క్రమంలో ఏర్పాటు చేసుకున్నదే న్యూయార్క్‌లో భగవత్ ప్రసంగ సభ. భారతదేశం నుంచి వీళ్లు పోయి అక్కడ చెప్పేదేమిటి?ఈ దేశపు సాంస్కృతిక జీవన విధానాన్ని ఏమైనా ప్రతిబింబిస్తారా?ప్రపంచంలోని ప్రజలకు వీళ్లు వినిపించే సందేశం ఏమిటి? న్యూయార్క్‌లో ఉన్న ప్రజలకు, ప్రజాస్వామిక వాదులకు వీళ్ల విషయాలన్నీ తెలుసు. అందుకే 'మోహన్ భగవత్ ఇక్కడ సభ పెట్టటాన్ని మేం వ్యతిరేకిస్తున్నాం' అని ప్రదర్శన తీశారు. వాళ్లింకా ఏమన్నారంటే, మహాత్మా గాంధీని చంపిన వారసులు వీళ్లు, వీళ్ల సభను జరగనివ్వమని నినదించారు. అంతే కాదు, వేలాది మందిని చంపిన యుద్ధ పిపాసి, ఫాసిస్టు హిట్లర్ వీరికి ఆదర్శం. అటువంటి సంఘ్ శక్తులకు అవకాశం ఇవ్వవద్దని ధర్నా నిర్వహించారు. హిందూ మతతత్వ శక్తులకు ఇక్కడ చోటులేదని పెద్దఎత్తున మాడిసన్ వీధులలో ప్రదర్శనలు తీశారు. వాళ్లంతా హిందూ సమూహాలే కావడం విశేషం. ఇక న్యూయార్క్ మేయర్ జొహ్రాన్ మమ్దాని కూడా తాను ఈ కార్యక్రమానికి మద్దతివ్వటం లేదని ప్రకటించారు. అయితే అదొక ప్రైవేటు కార్యక్రమం కావడం వల్ల దాన్ని రద్దుచేసే అధికార పరిధి నగర ప్రభుత్వానికి ఉందా అన్నది వేరే ప్రశ్న అని ఆయన పేర్కొన్నారు. కానీ ఆరెస్సెస్ గురించిన తన అభిప్రాయాలను బహిరంగంగానే వ్యక్తం చేశారు. మమ్దాని గుజరాత్ రాష్ట్ర వారసత్వం కలిగినవారు. భారతదేశానికి సంబంధించిన అవగాహన ఉన్నవాడు. ఆయన ఏమన్నారంటే, 'తన కుటుంబం తనకు నేర్పిన భారతదేశం, తాను పెరిగిన భారతదేశం "బహుళత్వ సమాజం, లౌకిక గణతంత్రం" అని, భారతదేశానికి చెందిన ప్రతి వ్యక్తికీ ఆ దేశంలో తనదైన స్థానం, హక్కు, గౌరవం ఉందనే భావనతో తాను పెరిగానని చెప్పారు. ఒక దేశం ఎవరిది? అనే ప్రశ్నకు సమాధానం ఒకే మతం, ఒకే వర్గం, ఒకే గుర్తింపుగా మారకూడదని, ఏ దేశాన్నయినా ఇతరులను వెలివేసే, పక్కనపెట్టే దృక్పథంతో చూడటం తనకు ఆందోళన కలిగించే విషయమని, అందుకే ఆరెస్సెస్ కార్యక్రమానికి మద్దతు ఇవ్వడం లేదని స్పష్టం చేశారు. మమ్దాని వ్యాఖ్యలు మొత్తం సంఘ్ భావజాలంపై చేసినవి. అనేక మతాలు, భాషలు, సంస్కృతులు కలిగిన భారతదేశాన్ని గుర్తుచేసి, దేశపు బలాన్ని స్పష్టం చేశారు. మమ్దాని చేసిన వ్యాఖ్యలు ఆరెస్సెస్ అసలు స్వరూపాన్ని బయటపెట్టింది. అంతేకాక సంఘ్ ఆలోచనలతో నడుస్తున్న దేశంలో ప్రభుత్వ విధానాల అసహ్యతనూ ఎత్తిచూపింది. మేయర్ జొహ్రాన్ అనుభవంలోని భారతదేశాన్ని, దాని స్వరూపాన్ని, స్వభావాన్ని మార్చే ప్రయత్నం ఇప్పుడు జరుగుతున్నది. దేశ వారసత్వ సంపద అయిన లౌకికత్వాన్ని తొలగించి, దేశం కేవలం హిందూత్వ రాష్ట్రంగా మలచే ప్రయత్నం చేస్తున్నారు. బహుళ సంస్కృతులను, భిన్నత్వాలను ఏకత పేరుతో నిరాకరించడం, ప్రపంచం ముందు భారత దేశాన్ని ఒక మతతత్వ దేశంగా చూపెట్టడానికి, దిగజార్చడానికి ఆరెస్సెస్ కృషి చేస్తున్నది. ప్రపంచ దేశాలకి ఈ చర్యల పట్ల తీవ్ర వ్యతిరేకత ఎదురవుతున్నది. ఏకత పేరుతో అప్రజాస్వామిక, నిరంకుశ, ద్వేష ప్రచారం వమ్ముకాక తప్పదు.

# లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు,ఎల్ఓసీల పంపిణీ

● అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి శంకుస్థాపన





**తలకొండపల్లిఆగస్టు 31, ( నేటి దర్శిని):**
తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చుక్కగుట్ట తండా నుంచి జూలపల్లి వరకు ఒక కిలోమీటర్ మేర రూ. 1.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే జూలపల్లి నుంచి చంద్రధన వరకు మూడు కిలోమీటర్ల మేర రూ. 2.40 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు కూడా శంకుస్థాపన చేశారు. జూలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మంజూరైన 15 ఇందిరమ్మ ఇళ్లలో తొలిదశగా 5 ఇళ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని అన్నారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడంతో పాటు అర్హులైన పేదలకు పక్కా గృహాలు అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మిడ్జిల్ మండలంలో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**మిడ్జిల్, ఆగస్టు 31, (నేటి దర్శిని):**
జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి మిడ్జిల్ మండలంలో పర్యటించి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేయనున్నారుఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని



కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షులు గౌస్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పర్యటనను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు.

# టీయూడబ్ల్యూజే (హెచ్-143) జడ్చర్ల పట్టణ నూతన కమిటీ ఎన్నిక



**మిడ్జిల్, ఆగస్టు 31, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):**
జడ్చర్ల టీయూడబ్ల్యూజే (హెచ్-143) మహబూబ్‌నగర్ జిల్లా అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో జడ్చర్ల పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ వరంగల్ శివకుమార్, కో-కన్వీనర్ చింతకాయల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు.

**నూతన కమిటీ వివరాలు:**
అధ్యక్షుడు ఆర్. అమర్నాథ్ గౌడ్
ప్రధాన కార్యదర్శి కె. శ్రీకాంత్ రెడ్డి
ఉపాధ్యక్షులు ఎం.డి. ఖాజా మొయినుద్దీన్, పి. రఘు
కోశాధికారి ఎస్. చెన్నయ్య (సురేష్)
సంయుక్త కార్యదర్శి వడ్ల వేణు
ప్రచార కార్యదర్శి కిరణ్ కుమార్

కార్యవర్గ సభ్యులుగా అశోక్ కుమార్, మహేష్ కుమార్, నిస్సార్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రవికుమార్ (టీవీ5), నరేందర్ గౌడ్ (ఆంధ్రజ్యోతి)తో పాటు పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు. అంతకుముందు అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో జడ్చర్ల పట్టణ యూనియన్ సభ్యులకు సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన జడ్చర్ల పట్టణ కమిటీ సభ్యులను అడ్‌హక్ కమిటీ నాయకులు అభినందించారు. పాత్రికేయుల హక్కుల పరిరక్షణతో పాటు యూనియన్‌ను మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆకాంక్షించారు.

# మైనర్ బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి 10 ఏళ్ల జైలు!

● నల్లగొండ జిల్లా పోక్సో న్యాయస్థానం సంచలన తీర్పు
● రూ.5 వేల జరిమానా.. బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం



**డిండి , ఆగస్టు 31 నేటి దర్శని :**
మైనర్ బాలికపై పలుమార్లు అత్యాచారానికి పాల్పడిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ నల్లగొండ జిల్లా పోక్సో న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించింది. బాధిత మైనర్ బాలికకు రూ. 7 లక్షల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.

**2020లో ఘటన.. 2021లో కేసు విచారణ**
డిండి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రతాప్‌నగర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మూడవత్ మల్లేష్ మైనర్ బాలికను లోబర్చుకుని పలుమార్లు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని, తల్లిదండ్రులకు చెబితే పరువు తీస్తానని నిందితుడు బాలికను బెదిరించినట్లు కేసు వివరాల్లో పేర్కొన్నారు. ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురైన బాలిక 2020 సెప్టెంబర్ 8న పురుగుల మందు సేవించగా, తొలుత దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హస్తినాపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వైద్యుల పరీక్షల్లో బాలిక మూడు నెలల గర్భవతిగా తేలినట్లు కేసు వివరాలు వెల్లడించాయి. ఫిర్యాదుతో కేసు నమోదు బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు 2020 సెప్టెంబర్ 12న డిండి పోలీస్‌స్టేషన్‌లో నిందితుడిపై కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ నంబర్ 97/2020, సెషన్స్ కేసు నంబర్ 101/2021గా నమోదు కాగా, ఐపీసీ సెక్షన్ 376(2)(అ), 506తో పాటు పోక్సో చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బలమైన వాదనలు.. నిందితుడికి శిక్ష కేసు విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్ కుమార్ బలమైన వాదనలు వినిపించారు. వాదనలు, సాక్ష్యాలను పరిశీలించిన నల్లగొండ జిల్లా పోక్సో న్యాయస్థానం న్యాయమూర్తి విశ్వనాథ్ కులకర్ణి దిలీప్ రావు నిందితుడు మూడవత్ మల్లేష్‌కు 10 సంవత్సరాల కారాగార శిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. బాధిత మైనర్ బాలికకు రూ. 7 లక్షల పరిహారం ప్రకటించారు. విచారణలో అధికారుల సహకారం కేసు దర్యాప్తులో అప్పటి స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎం. రాములు, అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేశ్వర్లు, ప్రస్తుత ఎస్‌హెచ్‌ఓ సీహెచ్. బాలకృష్ణ, ప్రస్తుత సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే. బీసన్న, సీడీఓ పి. లింగయ్య, భరోసా లీగల్ ఆఫీసర్ మామిడి కల్పన తదితర అధికారులు సహకరించినట్లు పోలీసులు తెలిపారు.

# డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డ్ ఎంపికైన యేకుల సురేష్

**కొండ మల్లేపల్లి, ఆగస్ట్ 31 ( నేటి దర్శిని):**
నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం కి చెందిన సమాజ సేవకుడు, బహుజన నాయకులు, సమతా సైనిక్ దళ్ నల్గొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ యేకుల సురేష్ ప్రతిష్టాత్మక 'డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేషనల్ అవార్డు'కు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం వేదికగా అకాడమీ జాతీయ కమిటీ యేకుల సురేష్‌కు అధికారిక ఎంపిక పత్రాన్ని మరియు పూలగుచ్ఛాన్ని అందజేసి ప్రత్యేక అభినందనలు తెలిపింది. నల్గొండ జిల్లాకు చెందిన యేకుల సురేష్ ఎన్నో ఉన్నత విద్యలను అభ్యసించారు. గ్రాడ్యుయేషన్ తర్వాత న్యాయశాస్త్రంలో ఎల్.ఎల్.బి పూర్తి చేసిన యేకుల సురేష్, విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత పట్ల చైతన్య స్ఫూర్తితో పనిచేస్తూ పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాల భావజాల వ్యాప్తికి




కృషి చేశారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్థాపించిన సమతా సైనిక్ దళ్ ద్వారా నల్గొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న యేకుల సురేష్, అంబేద్కర్ బోధించిన "లక్ష్య సాధనకు విద్యే మూలం" అనే మార్గాన్ని నమ్మి ఎంతో మంది పేద విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. రాజ్యాంగం పౌరులకు అందించిన హక్కులు, విధులపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు సమతా సైనిక్ దళ్ వేదికగా, మరియు రాజ్యాంగ పరిరక్షణ నాయకులుగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. యేకుల సురేష్ అందిస్తున్న ఈ సేవా తత్పరతను పరిగణనలోకి తీసుకుని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కమిటీ ఆయనను ఈ జాతీయ పురస్కారానికి ఎంపిక చేసింది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సెప్టెంబర్ 5వ తేదీన నిర్వహించబోయే 'బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర కాన్ఫరెన్స్' వేడుకలో ఈ అవార్డును అధికారికంగా ప్రధానం చేయనున్నారు. దక్షిణాదిలోని ఆరు రాష్ట్రాల నుంచి సుమారు 500 మందికి పైగా మేధావులు, కవులు, రచయితలు మరియు ప్రతినిధులు హాజరయ్యే ఈ వైభవపేతమైన మహాసభలో యేకుల సురేష్‌ను ఘనంగా సత్కరించనున్నారు. యేకుల సురేష్ జాతీయ అవార్డుకు ఎంపిక కావడం పట్ల పలువురు సంఘాల నాయకులు, మిత్రులు హర్షం వ్యక్తం చేశారు.

# భూత్పూర్ సర్కిల్ కార్యాలయంలో వార్షిక తనిఖీ నిర్వహించిన మల్టీజోన్-II ఐజీ షానవాజ్ ఖాసిం, ఐపీఎస్

**మిడ్జిల్, ఆగస్టు 31, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో) :**
వార్షిక తనిఖీల్లో భాగంగా సోమవారం మల్టీజోన్-II ఐజీ షానవాజ్ ఖాసిం, ఐపీఎస్ భూత్పూర్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయంలో నిర్వహిస్తున్న వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. తనిఖీలో భాగంగా సర్కిల్ కార్యాలయంలో నిర్వహించాల్సిన ముఖ్యమైన రికార్డులు, రిజిస్టర్లు, కేసు డైరీలు, క్రైమ్ రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కోర్టు కేసులు, వారెంట్లు, సీసీటీఎన్ఎస్/ఆన్‌లైన్ రికార్డులు మరియు ఇతర పోలీసు సంబంధిత రికార్డుల నిర్వహణను ఐజీ పరిశీలించారు. అలాగే సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, పెండింగ్ కేసుల పరిష్కారం, దర్యాప్తు నాణ్యత, నేరస్థులపై నిఘా, రౌడీషీటర్ల పర్యవేక్షణ, వారెంట్ల అమలు, బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, మహిళలు మరియు బాలల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై ఐజీ గారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తన పరిధిలోని పోలీస్ స్టేషన్లను సమర్థవంతంగా పర్యవేక్షిస్తూ, సిబ్బందికి సరైన మార్గనిర్దేశం చేయడం, కేసుల దర్యాప్తును పర్యవేక్షించడం, పెండింగ్ కేసులను తగ్గించడం, నేరాల నివారణకు ముందస్తు చర్యలు




చేపట్టడం, ప్రజలతో సమన్వయంతో పనిచేయడం వంటి విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఐజీ సూచించారు. కేసుల దర్యాప్తులో సాక్ష్యాల సేకరణ, కేసుల నాణ్యత, దర్యాప్తు వేగం, కోర్టు ట్రయల్స్‌పై పర్యవేక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, నేరస్తులకు శిక్ష పడేలా దర్యాప్తు అధికారులు సమర్థవంతంగా పనిచేసేలా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, ఫిర్యాదులపై సత్వర స్పందన, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించడం, సిబ్బంది క్రమశిక్షణ మరియు సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడంపై ఐజీ పలు సూచనలు చేశారు. తనిఖీ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, జిల్లాలోని అందరూ ఇన్స్పెక్టర్లు, భూత్పూర్ సర్కిల్ పరిధిలోని సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కాలుష్య రహిత ఇంధన కార్యాచరణ వేగం పెంచాలి





- బీఆర్ఈ సమ్మిట్-2026' రోడ్‌షో హైదరాబాద్ చేరిన నేపథ్యంలో ప్రభుత్వం పిలుపు
- న్యూఢిల్లీలోని భారత్ మండపంలో నవంబరు 2 నుంచి 5 వరకు 'భారత పునరుత్పాదక ఇంధన సదస్సు-ప్రదర్శన' (బీఆర్ఈ)
- కాలుష్య రహిత ఇంధన రంగ భాగస్వాములను ఒక వేదికపైకి తెస్తూ జాతీయ స్థాయిలో మూడోదిగా హైదరాబాద్ రోడ్‌షో

**హైదరాబాద్, ఆగస్టు 31(నేటి దర్శిని):** జాతీయ స్థాయిలో అత్యంత భారీదైనా "భారత పునరుత్పాదక ఇంధన సమ్మిట్ అండ్ ఎక్స్‌పో-2026" (బీఆర్ఈ సమ్మిట్)లో భాగంగా తొలి రెండో రోడ్‌షోలను జైపూర్, ముంబయి నగరాల్లో నిర్వహించారు. ఈ ప్రాంతీయ రోడ్‌షోల పరంపర ఉత్తేజాన్ని హైదరాబాద్‌లో కొనసాగిస్తూ ప్రభుత్వ, పారిశ్రామిక, పునరుత్పాదక ఇంధన రంగ ప్రముఖులు ఈ రోజు హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. దేశం 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజేతర ఇంధన సామర్థ్యం సాధించాలనే లక్ష్యం దిశగా భారత్ శరవేగంగా పురోగమిస్తున్న తరుణంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర శక్తియుత కాలుష్య రహిత ఇంధనావరణ వ్యవస్థను జాతీయ స్థాయిలో ప్రస్ఫుటం చేసింది. అంతేకాకుండా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల విభిన్న కాలుష్య రహిత ఇంధన సామర్థ్యం, పెట్టుబడి అవకాశాలను కూడా వెల్లడించింది.

పునరుత్పాదక ఇంధన విస్తరణ, సాంకేతికత, తయారీ, పారిశ్రామికాభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ఆవిష్కరణలు- పెట్టుబడులు తదితర రంగాల రీత్యా జాతీయ ఇంధన రూపాంతరీకరణలో దక్షిణాదిలోని ఈ మూడు రాష్ట్రాలకూ కీలక, పరస్పర పూరక సామర్థ్యం ఉంది. ప్రగతిశీల విధానాలు, పెరుగుతున్న ఇంధన ప్రాజెక్టుల సంఖ్య, అవకాశాలతో జాతీయ పునరుత్పాదక ఇంధన రంగ వృద్ధిలో తదుపరి దశకు ఈ మూడు రాష్ట్రాలూ శక్తివంచన లేకుండా దోహదం చేయగలవు. ఈ నేపథ్యంలో నవ్య-పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన ఈ రోడ్‌షోను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాల నాయకులు, సస్టెయినబుల్ ప్రాజెక్ట్స్ డెవలపర్స్ అసోసియేషన్, ఇండియన్ సోలార్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్‌ల ప్రతినిధులు ఒకే వేదికపైకి వచ్చారు.

అంతర్జాతీయ సౌర కూటమి 9వ సమావేశం, గ్రీన్ హైడ్రోజన్‌పై 4వ అంతర్జాతీయ సదస్సుతోపాటు బీఆర్ఈ సమ్మిట్-2026ను నిర్వహిస్తున్నారు. ప్రపంచ అగ్రగాములు, విధాన రూపకర్తలు సహా పారిశ్రామికులు, పెట్టుబడిదారులు, ఆవిష్కర్తలు తదితరులందరూ ఈ సదస్సు ద్వారా ఒకే వేదికపైకి వచ్చారు.

ఈ సందర్భంగా సస్టెయినబుల్ ప్రాజెక్ట్స్ డెవలపర్స్ అసోసియేషన్ పాలక మండలి సభ్యుడు శ్రీ రవివర్మ తొలుత ఆహూతులకు స్వాగతం పలకడంతోపాటు రోడ్‌షో నేపథ్యాన్ని వివరించారు.

ఈ మేరకు పారిశ్రామిక సహకార బలోపేతం లక్ష్యంగా వాటాదారుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, బీఆర్ఈ సమ్మిట్-2026 వ్యూహాత్మక బృహత్ప్రణాళికను విశదీకరిస్తూ హైదరాబాద్ రోడ్‌షో ఒక సమగ్ర కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా కాలుష్య రహిత ఇంధన రూపాంతరీకరణ వైపు భారత్ ప్రస్థానాన్ని వివరిస్తూ, న్యూఢిల్లీ సమ్మిట్ స్థాయిని ఆవిష్కరిస్తూ- 'ఇండియాస్ రెన్యూవబుల్ ఎనర్జీ జర్నీ', 'బీఆర్ఈ సమ్మిట్ అండ్ ఎక్స్‌పో-2026' పేరిట రెండు చిత్రాలను ప్రదర్శించారు. అటుపైన నవ్య-పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ సీనియర్ ప్రతినిధి ఒకరు వివిధ అంశాలను విశదీకరించారు. ఈ మేరకు జాతీయ-అంతర్జాతీయ భాగస్వాముల కోసం వ్యూహాత్మక లక్ష్యాలు, ప్రధానాంశాలు, ప్రతిపాదిత భాగస్వామ్య చట్రం తదితరాల గురించి వివరించారు. అనంతరం 'ఓఈఎం'లు, ప్రాజెక్ట్ డెవలపర్లు, పెట్టుబడిదారులకుగల వ్యాపార అవకాశాలు, వాణిజ్య భాగస్వామ్య నమూనాలపై ఒక ప్రత్యేక గోష్ఠి కూడా నిర్వహించారు. దీంతోపాటు అధికారిక బీఆర్ఈ సమ్మిట్ డిజిటల్ పోర్టల్, మొబైల్ అప్లికేషన్‌పై ప్రత్యక్ష ప్రదర్శన-వివరణ కార్యక్రమం కూడా నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ నూతన, పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (ఎన్ఆర్ఈడీసీఏపీ) వైస్ ఛాన్సలర్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కమలాకర్ బాబు మెరుపు మాట్లాడుతూ... 2029 నాటికి 160 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని జోడించాలనే లక్ష్యం నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ సమీకృత పరిశుద్ధ ఇంధన విధానం-2024 కింద రాష్ట్రం రూపొందించిన ప్రతిష్ఠాత్మక పరిశుద్ధ ఇంధన రోడ్‌మ్యాప్‌ను ఆయన వివరించారు. పునరుత్పాదక ఇంధనం, నిల్వ, గ్రీన్ హైడ్రోజన్, బయోఫ్యూయల్స్, పరిశుద్ధ ఇంధన తయారీ, పునరుత్పాదక ఇంధన తయారీ జోన్ (ఆర్ఈఎమ్‌జెడ్) వంటి ప్రాజెక్టులతో రాష్ట్ర బలమైన పెట్టుబడి ప్రతిపాదననూ ఆయన వివరించారు. ఇవి ఆంధ్రప్రదేశ్‌ను పరిశుద్ధ ఇంధన పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా నిలుపుతాయని శ్రీ కమలాకర్ బాబు తెలిపారు. పరిశుద్ధ ఇంధన అవకాశాలను ప్రదర్శించడానికి, పెట్టుబడిదారులు, పారిశ్రామిక భాగస్వాములతో చర్చలు జరపడం లక్ష్యంగా భారత పునరుత్పాదక ఇంధన సదస్సు, ఎక్స్‌పో-2026లో క్రియాశీల భాగస్వామ్యం కోసం రాష్ట్రం ఆసక్తిగా ఉందనీ ఆయన తెలిపారు.

తమిళనాడు గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ లిమిటెడ్ డైరెక్టర్ (ఫైనాన్స్) శ్రీమతి బి. రాజేశ్వరి మాట్లాడుతూ... పునరుత్పాదక ఇంధన రంగంలో, ముఖ్యంగా పవన, సౌర విద్యుత్ రంగాల్లో తమిళనాడు సుదీర్ఘకాల నాయకత్వాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. రాష్ట్రంలో సమీకృత పునరుత్పాదక ఇంధన వ్యవస్థ బలోపేతం కోసం రూపొందించిన ప్రణాళికలను ఆమె వివరించారు. పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిని అనుసంధానించడంలో, గరిష్ఠ విద్యుత్ అవసరాలను తీర్చడంలో ఇంధన నిల్వ, పంప్డ్-స్టోరేజ్ ప్రాజెక్టుల ప్రాముఖ్యత పెరుగుతోందని ఆమె స్పష్టం చేశారు. సరళీకృత, ఆన్‌లైన్ ఆమోద ప్రక్రియల ద్వారా పెట్టుబడిదారులకు మరింత అనువైన వాతావరణాన్ని కల్పించడానికి రాష్ట్రం చేస్తున్న ప్రయత్నాలనూ శ్రీమతి రాజేశ్వరి ప్రముఖంగా ప్రస్తావించారు.

తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టీజీరెడ్కో) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ముషారఫ్ అలీ ఫరూఖీ మాట్లాడుతూ... పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి, పరిశుద్ధ ఇంధన తయారీ కోసం ప్రోత్సాహకాలను అందించే పరిశుద్ధ, హరిత ఇంధన విధానం-2025 మద్దతుతో తెలంగాణలో పెరుగుతున్న పునరుత్పాదక ఇంధన లక్ష్యాలను ప్రముఖంగా ప్రస్తావించారు. వేగంగా పెరుగుతున్న రాష్ట్ర ఇంధన అవసరాలను పరిశుద్ధ ఇంధనం ద్వారా తీర్చాలనే రాష్ట్ర దార్శనికతనూ ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న అవకాశాలను అన్వేషించాల్సిందిగా పెట్టుబడిదారులు, తయారీదారులు, పరిశ్రమలను ఆహ్వానిస్తూ... భారత పునరుత్పాదక ఇంధన సదస్సు, ఎక్స్‌పో-2026లో క్రియాశీల భాగస్వామ్యానికి తెలంగాణ కట్టుబడి ఉందని శ్రీ ముషారఫ్ అలీ పునరుద్ఘాటించారు.

నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ (ఎంఎన్ఆర్ఈ) సంయుక్త కార్యదర్శి శ్రీ అనుపమ్ కుమార్ హైదరాబాద్ రోడ్‌షోలో ప్రసంగించారు. భారత పునరుత్పాదక ఇంధన ప్రస్థానం నూతన దశలోకి ప్రవేశించిందని ఆయన పేర్కొన్నారు. శిలాజేతర ఇంధన స్థాపిత సామర్థ్యం 300 గిగావాట్లను దాటిందనీ, 2030 నాటికి 500 గిగావాట్ల ప్రతిష్ఠాత్మక లక్ష్యం దిశగా దేశం పురోగమిస్తోందని శ్రీ అనుపమ్ కుమార్ తెలిపారు. ఈ పరివర్తన తదుపరి దశ కేవలం పునరుత్పాదక విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని పెంచడానికే పరిమితం కాదన్నారు. ప్రసారం, ఇంధన నిల్వ, తయారీ, గ్రీన్ హైడ్రోజన్, డిజిటల్ టెక్నాలజీలు, ఫ్లెక్సిబుల్ పవర్, డిమాండ్‌ను కలుపుకొని... ఒక సమీకృత, విశ్వసనీయ, సౌకర్యవంతమైన పరిశుద్ధ ఇంధన వ్యవస్థను నిర్మించడంపై ఈ దశ ప్రధానంగా దృష్టి సారిస్తుందని ఆయన స్పష్టం చేశారు. పునరుత్పాదక ఇంధనం ఇకపై కేవలం పర్యావరణ అవసరం మాత్రమే కాదన్నారు. అది భారత ఇంధన భద్రత, ఆర్థిక సామర్థ్యం, పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగ కల్పనకు కేంద్రంగా మారిందని శ్రీ అనుపమ్ కుమార్ పేర్కొన్నారు. సాంకేతికత, ఇంజనీరింగ్, తయారీ, పరిశోధన, వ్యవస్థాపనలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల బలాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ మూడు రాష్ట్రాలు పరిశుద్ధ ఇంధన సాంకేతికతల వినియోగదారులుగా మాత్రమే కాకుండా... భారత ఇంధన పరివర్తనలో ఉత్పత్తిదారులుగా, ఆవిష్కర్తలుగా, పెట్టుబడిదారులుగా, సాంకేతిక భాగస్వాములుగా ఎదిగే అవకాశం ఉందనీ శ్రీ అనుపమ్ కుమార్ తెలిపారు. సౌర విద్యుత్ ఉత్పాదక రంగం, పవర్ ఎలక్ట్రానిక్స్, బ్యాటరీ, ఇతర నిల్వ సాంకేతికతలు, ఎలక్ట్రోలైజర్లు, గ్రీన్ హైడ్రోజన్, దాని ఉత్పన్నాలు, గ్రిడ్ సాంకేతికతలు, డిజిటల్ ఇంధన-నిర్వహణ వ్యవస్థలు, ఏఐ-ఆధారిత అంచనాలు, ఎలక్ట్రిక్ మొబిలిటీ, బయోఎనర్జీ, అధునాతన పదార్థాల వంటి రంగాల్లో పెరుగుతున్న అవకాశాలనూ ఆయన ప్రస్తావించారు. తమ పునరుత్పాదక ఇంధన రోడ్‌మ్యాప్‌లు, పెట్టుబడి అవకాశాలు, గ్రీన్-హైడ్రోజన్, నిల్వ ప్రణాళికలు, పారిశ్రామిక సామర్థ్యాలు, ఆవిష్కరణల వ్యవస్థలను ప్రపంచానికి ప్రదర్శించడానికి భారత పునరుత్పాదక ఇంధన సదస్సు, ఎక్స్‌పో-2026ను వేదికగా ఉపయోగించుకోవాలని మూడు రాష్ట్రాలకూ ఆయన సూచించారు.

## ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్
- ప్రజావాణికి 87 వినతులు





**మిడ్జిల్, ఆగస్టు 31, (నేటి దర్శని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ప్రజల నుంచి 87 వినతులను స్వీకరించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి జియోట్యాగింగ్ చేయడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు, భూభారతి, ఉపాధి హామీ, ప్రజావాణి తదితర పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని, మండలాల వారీగా పెండింగ్ సమస్యలను గుర్తించి సత్వరం పరిష్కరించాలని తెలిపారు. జిల్లా అధికారులు తమకు కేటాయించిన మండలాల్లో క్రమం తప్పకుండా పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని సూచించారు.

ఈ సమావేశంలో డీఆర్వో ఏ. నిర్మల, జెడ్పీ సీఈఓ ఇన్‌చార్జి డీపీఓ వెంకటరెడ్డి, డీఆర్డీఓ నర్సింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రూ.15 కోట్లతో ఆమనగల్లు మున్సిపాలిటీ అభివృద్ధి

- మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్



**ఆమనగల్లు,ఆగస్టు 31(నేటి దర్శిని):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి లో రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 3న 9వ వార్డు శ్రీకాంత్ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేయనున్న శిలాఫలకం స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్,కమిషనర్ రాఘవేందర్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పత్యా నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆమనగల్లు మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి పరంగా వెనుకబడిన మున్సిపాలిటీని ప్రజల భాగస్వామ్యంతో ముందుకు తీసుకెళ్తామని, ప్రజలు కోరుకునే విధంగా రోడ్లు,డ్రైనేజీలు,మౌలిక వసతులను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి ఆమనగల్లు ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వెంకటయ్య, ఎర్రవోలు మహేష్, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్, దేవరశెట్టి మహేష్, బిందు డ్రెస్సెస్ శేఖర్,వంశీ,షర్పు, మహబూబ్, మున్సిపల్ సిబ్బంది,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## కుర్మపల్లిలో వైభవంగా శ్రీ కాళికామాత ఆలయ ముఖాద్వారం ప్రారంభం

- ఎమ్మెల్యే బాలునాయక్ చేతుల మీదుగా నేడు ప్రారంభోత్సవం



**చింతపల్లి, ఆగస్టు 31 నేటి దర్శిని :** భక్తుల కొంగుబంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా కొలువుదీరిన ఆదిపరాశక్తి శ్రీ కాళికాదేవి, జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనుల్లో భాగంగా మరో కీలక ఘట్టానికి సిద్ధమైంది. చింతపల్లి మండలం అంగడి కుర్మపల్లి గ్రామంలోని విరాట్‌నగర్ కుర్మపల్లి 'ఎక్స్' రోడ్డులో నూతనంగా నిర్మించిన అమ్మవారి ముఖాద్వారం (కమాన్) ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. సెప్టెంబర్ 1న ఉదయం 9 గంటలకు దేవరకొండ శాసనసభ్యులు శ్రీ నెనావత్ బాలునాయక్ చేతుల మీదుగా ముఖాద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

ఈ సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని దేవస్థాన కమిటీ కోరింది. ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. భక్తి శ్రద్ధలతో జరిగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

## శ్రీ ఆంజనేయ స్వామి, పోచమ్మ తల్లి

# ఆశీస్సులు ప్రజలపై ఉండాలి

**-బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**

**-రాంనగర్ కాలనీలో ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి, పోచమ్మ తల్లి మహోత్సవం**



**రంగారెడ్డి జిల్లా ఆగస్ట్ 31(నేటి దర్శిని):** షాద్‌నగర్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో శ్రీ ఆంజనేయ స్వామి, పోచమ్మ తల్లి ధ్వజారోహణ మరియు బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ పాల్గొని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహకారంగా రూ.50,000 విరాళాన్ని రవీందర్ యాదవ్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, రాంనగర్ కాలనీపై శ్రీ ఆంజనేయ స్వామి, పోచమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, కాలనీ ప్రజలను అభినందించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వాణి పాండురంగారెడ్డి, వసంత శ్రీనివాస్, శారద శేఖర్, మహమ్మద్ ఎజాజ్ (అడ్డు), ఎస్పీ శివ, సర్పంచ్ వేణుగోపాల్, మాజీ కౌన్సిలర్లు శ్రీనివాస్ గౌడ్, వెంకట్రాం రెడ్డి, కానుగు అంతయ్య, నందకిషోర్, జూపల్లి శంకర్, చిన్న యాదగిరి, నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, రవి యాదవ్, శ్రీపాల్ రెడ్డి, బాలాజీ, ఆనంద్, బాలు యాదవ్, సంతోష్, భువనేశ్వర్ రెడ్డి, ప్రేమ్ కుమార్ గౌడ్, శివ, రాము నాయక్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆద్యంతం పారదర్శకత..
# లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం..

**●హైదరాబాద్ మహానగరంలో నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తూ, వారి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే ఇందిరమ్మ టవర్స్..**

**●అర్హతే ప్రామాణికంగా, కుల,మత,రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా లక్కీడ్రా ద్వార లబ్ధిదారుల ఎంపిక, పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.**



**రంగారెడ్డి జిల్లా ఆగస్ట్ 31 (నేటి దర్శిని):** శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇందిరమ్మ టవర్స్ ఫ్లాట్ల కోసం గచ్చిబౌలి లోని నిర్మిత కేంద్రంలో జరిగిన లక్కీడ్రా ఎంపికైన గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని కేశవ నగర్ కి చెందిన 9 మంది లబ్ధిదారులు పియేసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఎంపికైన లబ్ధిదారులను ప్రత్యేకంగా అభినందించిన పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా లక్కీ డ్రా లో ఎంపికైన లబ్ధిదారులు మాట్లాడుతూ చాలా సంతోషంగా ఉంది అని, మా స్వంతింటి కళ నెరవేరింది అని హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, పియేసి చైర్మన్ గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మన శేరిలింగంపల్లి నియోజకవర్గంకు ఇందిరమ్మ టవర్స్ లో 480 ఫ్లాట్లకు గాను లాటరీ ద్వారా డ్రా తీసి ఎంపిక చేసినట్లు , ఎంపికైన లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను అని, గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ రేవంత్ రెడ్డి గారు, గౌరవ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కి, నా తరుపున , లబ్ధిదారుల తరుపున, శేరిలింగంపల్లి నియోజకవర్గం ప్రజల తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాను అని, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం అని ్రాజ చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు.

లక్కీ డ్రా ద్వార 480 ప్లాట్ల కేటాయింపు లో నిర్దేశించిన రిజర్వేషన్ విధానం
ఎస్సీ -14% -67 ప్లాట్లు
ఎస్టీ - 5% -24 ప్లాట్లు
బీసీ - 16%. -77 ప్లాట్లు
జనరల్ -50% -240 ప్లాట్లు
ప్రభుత్వ/ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు -10% -48 ప్లాట్లుదివ్యాంగులు -5% - 24 ప్లాట్లు

లక్కీడ్రా పూర్తయిన తర్వాత లబ్ధిదారుల తుది ఎంపిక జరుగుతుంది, అధికారుల క్షేత్ర స్థాయి పరిశీలన అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తారు. ఆ తర్వాత కేవలం 3--4 రోజుల్లోనే టవర్స్ నిర్మాణ పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇందిరమ్మ టవర్స్ నిర్మాణంలో ఉన్నప్పుడు ఎంపికైనా లబ్ధిదారులు ఎప్పుడైనా వెళ్లి చూసుకోవచ్చు.. నాణ్యతపై లబ్ధిదారులకు పూర్తి హక్కు ఉంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13న కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ టవర్స్‌కు శంకుస్థాపన చేయగా...15 రోజుల రికార్డు సమయంలోనే 16 నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి టెండర్లు పిలవడం, మరోవైపు లబ్ధిదారుల ఎంపిక కోసం లక్కీడ్రా నిర్వహించడం అనేది పేదలకు అందించే ఇండ్ల విషయంలో ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధికి నిదర్శనం. ఎకరం వందల కోట్లు విలువ చేసే ప్రాంతాల్లోనూ పేద కుటుంబాలు గౌరవంగా జీవించాలి..ప్రభుత్వానికి పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా సొంత ఇంటిని అందించడం ముఖ్యం అని తెలియచేశారు.క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం హైదరాబాద్ గృహ నిర్మాణ రంగంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుంది.హైదరాబాద్ మహానగరంలో ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల కలను సాకారం చేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం మరో చారిత్రాత్మక అడుగు వేస్తోంది అని తెలియచేశారు.ఇందిరమ్మ టవర్స్‌లో లబ్ధిదారులకు అందించే ఇళ్లు సౌకర్యవంతంగా, ఆధునిక ప్రమాణాలతో నిర్మించనున్నాం. ప్రతిపాదిత ఇంటిలో ఒక బెడ్‌రూమ్, హాల్, కిచెన్‌తో కలిపి సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణం ఉంటుంది అని ్రాజ చైర్మన్ గాంధీ గారు తెలియచేశారు.

ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న ఈ ఇళ్లలో లబ్ధిదారుడి పేరుతో అన్‌డివైడెడ్ షేర్ కింద సుమారు 20 నుంచి 25 గజాల స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది.హైదరాబాద్ నగరం నడిబొడ్డున పేదవాడి ఇంటికి పునాది వేయడం అంటే కేవలం ఒక భవనం నిర్మించడం కాదు.. ఒక కుటుంబానికి భద్రత, ఒక తరానికి భరోసా, పేదవాడికి గౌరవంతో కూడిన జీవితం అందించడమే. హైదరాబాద్‌లో భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో నగరంలోనే సొంత ఇల్లు కావాలనే పేదల ఆకాంక్షను నెరవేర్చేందుకు ఇందిరమ్మ టవర్స్ నిర్మాణాలను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతుంది అని అన్నారు.

# అర్జీదారుల సమస్యలను నిర్ణీత గడువులో సత్వరమే పరిష్కరించాలి

**●బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్**






**బాపట్ల, జిల్లా , (నేటి దర్శిని):** బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ బాధితుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆదేశించారు. ఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరిగింది.వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీదారుల వినతులను జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఎల్. సుధాకర్, రేపల్లె డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ స్వయంగా స్వీకరించారు. అత్తారింటి వేధింపులు, ఆర్థిక పరమైన మోసాలు, స్థల వివాదాలు తదితర సమస్యలపై 54 మంది అర్జీదారులు తమ విన్నపాలను అందజేశారు.ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ అర్జీదారుల సమస్యలను చట్ట పరిధిలో విచారించి, త్వరితగతిన నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. అర్జీదారుల సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని పీజీఆర్ఎస్ విభాగానికి పంపాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పిజిఆర్ఎస్ సెల్ ఇన్స్పెక్టర్ కె.శ్రీనివాసరావు, ఎస్.ఐ లక్ష్మి రాజ్యం తదితర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ కొలువులకు ఇంటర్వ్యూలు!

**●17 పోస్టులకు అర్హులైన అభ్యర్థులకు అవకాశం**



**చింతపల్లి, ఆగస్టు 31 (నేటి దర్శిని):** చింతపల్లి మండలంలోని వివిధ అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 10 అంగన్వాడీ టీచర్ పోస్టులు, 7 అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో అర్హత సాధించిన వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు చింతపల్లి సీడీపీఓ సక్కుబాయి తెలిపారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

**10 టీచర్ పోస్టులు..**

నసర్లపల్లి-2, బాలాజీ తండ, కిష్టరాంపల్లి-1, వర్కాల-1, ఎం.మల్లేపల్లి, సాయిరెడ్డిగూడెం, కురంపల్లి-2, కురంపల్లి-1, పి.కె.మల్లెపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 10 అంగన్వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

**7 హెల్పర్ పోస్టులకు..**

గాసిరాం తండ, దేన్య తండ, రెడ్డి నాయక్ తండ, బాలాజీ తండ, దేవుల తండ, ఎర్రమట్టి తండ, ప్రశాంతిపురి తండ అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న 7 అంగన్వాడీ హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అర్హులైన అభ్యర్థులకు కూడా ఇంటర్వ్యూలు జరగనున్నాయి.

కాల్ లెటర్లు అందజేత

అర్హత సాధించిన అభ్యర్థులకు ఇప్పటికే కాల్ లెటర్లు అందజేసినట్లు సీడీపీఓ సక్కుబాయి తెలిపారు. అభ్యర్థులు తమకు అందిన కాల్ లెటర్‌లోని సూచనలను పూర్తిగా పరిశీలించుకుని, అందులో పేర్కొన్న అవసరమైన ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు.

సమయానికి హాజరు కావాలి

సెప్టెంబర్ 3న ఉదయం 9 గంటలకు దేవరకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నందున అర్హులైన అభ్యర్థులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని సీడీపీఓ కోరారు.


## అమీర్ అలీ ఫౌండేషన్ అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో ఏ కె ఫౌండేషన్ చైర్మన్ కట్టెబోయిన అనిల్ కుమార్




**హాలియా, ఆగస్టు 31 (నేటి దర్శిని):** హాలియా పట్టణంలోని శ్లోక స్కూల్ లో అమీర్ అలీ ఫౌండేషన్ వారు తమ సమాజ సేవలో భాగస్వామ్యం అయిన వారికి ఆవార్డు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఏకే ఫౌండేషన్ చైర్మన్ కట్టబోయిన అనిల్ కుమార్ హాజరై అమీర్ అలీ ఫౌండేషన్ నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి కొనియాడారు. వారు ఇంకా మరెన్నో కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మజార్, మాజీ కో ఆప్షన్ మెంబర్ అన్వర్, జననేత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ మునీర్ అలీ షేక్, అక్షర కిరణం మానసిక వికలాంగుల అనాధాశ్రమ వ్యవస్థాపకులు మేదరి కిరణ్, యాక్టర్ మూస అలీ ఖాన్, కమ్మపల ఫౌండేషన్ అమీర్ అలీ ఫౌండేషన్ సభ్యులు, పెద్దలు మరియు యువత తదితరులు పాల్గొన్నారు.

## సర్ హియరింగ్‌కు హాజరై ఓటు హక్కును కాపాడుకోవాలి


**●మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి**



**ఆమనగల్లు, ఆగస్టు31 (నేటి దర్శిని):** సర్ 2026లో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలోని ఆమనగల్లు మున్సిపాలిటీ పోలింగ్ స్టేషన్ నెంబర్ 192 విఠాయిపల్లి లో సోమవారం హియరింగ్ నిర్వహించారు. ఏఈ ఆర్వో , మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నో మ్యాపింగ్, డిస్క్రెపెన్సీస్ కారణంగా నోటీసులు అందుకున్న ఓటర్లు తమ గుర్తింపు కార్డులు, సంబంధిత ధ్రువపత్రాలను అధికారులకు సమర్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు తప్పనిసరిగా హియరింగ్‌కు హాజరై, తమకు సంబంధించిన గుర్తింపు పత్రాలను సమర్పించాలని సూచించారు. తద్వారా ఓటర్ల వివరాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించుకుని తమ ఓటు హక్కును భద్రపరచుకోవచ్చని తెలిపారు. మున్సిపాలిటీలోని మిగతా పోలింగ్ స్టేషన్లలో నిర్వహించే హియరింగ్‌లకు కూడా నోటీసులు అందుకున్న ఓటర్లు తప్పక హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 10 వ వార్డ్ కౌన్సిలర్ కోగూరి అనిత శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ అనిత, మున్సిపల్ మేనేజర్ అంజనేయులు, బీఎల్ఓ సూపర్‌వైజర్ రాజశేఖర్, బీఎల్ఓ పాపయ్య, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవిష్ణు నుంచి మరో కొత్త సినిమా.


## కామెడీకి దూరంగా ఎమోషనల్ కథతో వస్తున్న యంగ్ హీరో!




వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యంగ్ హీరో శ్రీవిష్ణు మరో కొత్త సినిమాను ప్రకటించారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీవిష్ణు.. ఈసారి మాత్రం సరికొత్త ఎమోషనల్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ సమర్పణలో హారికా సూర్యదేవర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కొత్త దర్శకుడు సన్నీ సంజయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హారికా హాసిని ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత చినబాబు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ గ్లింప్స్ విడుదల చేశారు.తాజాగా విడుదలైన గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. చిన్నప్పటి నుంచి ఎన్నో కలలు కనే ఓ సాధారణ మధ్యతరగతి అబ్బాయి.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, బాధ్యతల కారణంగా తన ఆశలను పక్కన పెట్టి సాధారణ జీవితాన్ని కొనసాగించే పరిస్థితిని ఇందులో చూపించినట్లు తెలుస్తోంది. మంచి కాలేజీలో చదవాలనే కోరిక ఉన్నా కుటుంబ పరిస్థితుల కారణంగా సాధారణ కాలేజీలో చదవడం.. జీవితంలో ఎన్నో సాధించాలని ఆశించినా కుటుంబ బాధ్యతల కోసం ఉద్యోగం చేయడం.. ఇలా ఎంతోమంది మిడిల్ క్లాస్ యువకుల జీవితాల్లో ఎదురయ్యే పరిస్థితులను ఈ సినిమాలో చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది. శ్రీవిష్ణు సినిమాలంటే సాధారణంగా కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు డిఫరెంట్ కాన్సెప్ట్‌లు గుర్తుకొస్తాయి. అయితే ఈసారి ఆయన అందుకు భిన్నంగా ఎమోషనల్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. తన కలలను, ఆశలను కుటుంబం కోసం త్యాగం చేసే మిడిల్ క్లాస్ యువకుడి పాత్రలో శ్రీవిష్ణు కనిపించనున్నారని సమాచారం. గ్లింప్స్‌లో చూపించిన సన్నివేశాలు కూడా పాత్రలోని ఎమోషన్‌ను హైలైట్ చేసేలా ఉన్నాయి. దీంతో ఈ సినిమా శ్రీవిష్ణు కెరీర్‌లో మరో డిఫరెంట్ మూవీగా నిలిచే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైనట్లు చిత్రబృందం వెల్లడించింది. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను మాత్రం ప్రకటించలేదు. కథ, పాత్రకు సంబంధించిన మరిన్ని వివరాలను మేకర్స్ రాబోయే రోజుల్లో వెల్లడించే అవకాశం ఉంది. శ్రీవిష్ణు, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లోనూ ఆసక్తి పెరుగుతోంది.

# బాలయ్య కొత్త సినిమాకు రెండక్షరాల టైటిల్ ఫిక్స్..

## -సెప్టెంబర్ 6న భారీ ప్రకటన




నందమూరి నటసింహం బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ చీదీఖ111పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో 'వీరసింహారెడ్డి' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని అందించిన ఈ కాంబినేషన్ మరోసారి చేతులు కలపడంతో.. ఈ సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో మొదటి నుంచే ఉంది. బాలయ్య పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లిమ్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది.తాజాగా ఈ మూవీకి సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా అధికారిక టైటిల్‌తో పాటు థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను సెప్టెంబర్ 6న ప్రకటించనున్నట్లు వెల్లడించారు. దీంతో నందమూరి అభిమానుల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది.చీదీఖ111 కోసం ఇప్పటికే రెండు పవర్‌ఫుల్ టైటిల్స్ పరిశీలనలో ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. '+ూణ', 'ణూాణూ' (దాదా) అనే టైటిల్స్‌లో ఒకదాన్ని సినిమాకు ఖరారు చేసే అవకాశం ఉందని టాక్ వచ్చింది.బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు, గోపీచంద్ మలినేని మార్క్ యాక్షన్ ఎలిమెంట్స్‌కు ఈ రెండు టైటిల్స్ బాగా సెట్ అవుతాయని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం 'దాదా' టైటిల్‌నే దాదాపుగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది.అయితే దీనిపై అధికారిక క్లారిటీ మాత్రం సెప్టెంబర్ 6న రానుంది. ఆ రోజే టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించనుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. గోపీచంద్ మలినేని ఈసారి బాలయ్యను సరికొత్త యాక్షన్ అవతార్‌లో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. సినిమా కథ ముంబై నేపథ్యంలో సాగే గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఉండబోతుందని సమాచారం.బాలకృష్ణ ఇమేజ్‌కు తగ్గట్టుగా భారీ యాక్షన్ సన్నివేశాలతో పాటు పవర్‌ఫుల్ డైలాగ్స్, మాస్ ఎలివేషన్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని టాక్. బాలయ్య పాత్రను దర్శకుడు మరింత స్టైలిష్‌గా, మాస్ యాంగిల్‌లో డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో మరో ఆసక్తికరమైన అంశం మంచు మనోజ్ విలన్‌గా నటిస్తుండటం. బాలకృష్ణకు ప్రత్యర్థిగా మనోజ్ పవర్‌ఫుల్ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించనున్నారు. బాలయ్య, మనోజ్ మధ్య వచ్చే సన్నివేశాలు సినిమాకు కీలకంగా ఉంటాయని తెలుస్తోంది. ఇద్దరు మాస్ యాక్టర్స్ ముఖాముఖి తలపడే సన్నివేశాలు అభిమానులకు మంచి ట్రీట్ ఇస్తాయని చిత్ర వర్గాలు భావిస్తున్నాయి. ఈ హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మరోవైపు ఎస్. తమన్ సంగీతం అందిస్తున్నారు. బాలయ్య సినిమాలకు తమన్ అందించే మాస్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండటంతో ఈ సినిమాపైనా అంచనాలు పెరిగాయి.

# 'ఆదర్శకుటుంబం' కోసం క్లాసిక్ సాంగ్ రీమేక్?



తెలుగు ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో వెంకటేశ్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో రూపొందుతున్న 'ఆదర్శకుటుంబం: హౌస్ నెం 47' సినిమా ముందు వరుసలో ఉంటుంది. వెంకటేశ్ నటించిన నువ్వు నాకు నచ్చావ్, మల్లీశ్వరి చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు రాశారు. ఆ సినిమాల విజయాల్లో వెంకటేశ్ నటన, త్రివిక్రమ్ రచన ప్రధాన పాత్రలు పోషించాయనడం అతిశయోక్తి కాదు. అప్పుడు వెంకటేశ్ సినిమాకి రచయితగా పనిచేసిన త్రివిక్రమ్.. ఇప్పుడు అదే వెంకటేశ్‌ని డైరెక్ట్ చేస్తున్నారు. దాంతో 'ఆదర్శకుటుంబం' సినిమాపై ఆడియన్స్‌లో అంచనాలు ఆకాశమంత ఏర్పడ్డాయి. అక్టోబర్ 2న గాంధీజయంతి కానుకగా సినిమా విడుదల కానున్నది ఇదిలావుంటే.. ఈ సినిమాకు సంబంధించిన ఓ అసక్తికరమైన వార్త ప్రస్తుతం ఫిల్మ్ వర్గాల్లో చక్కర్లు కొడుతున్నది. ఆ వివరాల్లోకెళ్తే.. వెంకటేశ్ చిత్ర విజయాల్లో 'కూలీ నెం 1' సినిమా ఒకటి. ఆ సినిమాలోని 'దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా.. దయుంచయ్యా దేవా..' సాంగ్ ఎంత హిట్టో అందరికీ తెలిసిందే. వినాయకచవితి పందిళ్లలో నేటికీ ఈ పాట మారుమోగుతూనే ఉంది. ఆ పాటను ఈ సినిమా కోసం రీమేక్ చేస్తున్నట్టు తెలిసింది. ఇదే నిజమైతే.. సినిమాకు ఈ పాట ప్రత్యేక ఆకర్షణ కాకమానదు.క్లైమాక్స్, ఓ పాట మినహా ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని టాక్. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఫ్యామిలీ ఎమోషన్స్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో శ్రీనిధిశెట్టి కథానాయిక. నివేదా పేతురాజ్, యువిన, రాజ్ ప్రజ్వల్, రావురమేశ్, సత్య, బ్రహ్మాజీ ఇతర పాత్రధారులు. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఈచిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే.



# ఆమె వల్లే పేరు మార్చుకున్నా..

వ్యక్తిగత జీవితాన్ని, వృత్తిపరమైన బాధ్యతలనూ రెండిటినీ సమానంగా ఎంజాయ్ చేస్తుంటారు నటి కియారా అద్వానీ. పెళ్లి, ప్రెగ్నెన్సీ, పేరెంట్‌హుడ్.. ఇలా జీవితంలో ఎన్ని కొత్త దశలు వచ్చినా ఆమె కెమెరాకు బ్రేక్ ఇవ్వకపోవడానికి కారణం అదే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలోని ఆసక్తికరమైన అంశాలను కియారా వెల్లడించారు. 'మా అమ్మ టీచర్. నేనూ అమ్మలా టీచర్ కావాలనుకున్నా. కానీ నటిని అయ్యాను. డెస్టినీ అంటే అదే. నా అసలు పేరు ఆలియా. నేను ఇండస్ట్రీకి వచ్చేనాటికే అలియాభట్ పాపులర్. అందుకే పేరు మార్చుకోవాల్సి వచ్చింది. 'అంజానా అంజానీ' సినిమాలో ప్రియాంక చోప్రా పోషించిన 'కియారా' పాత్రంటే నాకెంతో ఇష్టం.అందుకే ఆ పాత్ర పేరునే నా పేరుగా మార్చుకున్నా. 'ఫగ్లీ'తో నా కెరీర్ మొదలైనా, 'ఎంఎస్ ధోని: ది అన్ టోల్డ్ స్టోరీ' చిత్రం నా కెరీర్‌ని మలుపు తిప్పింది. అందులో నేను పోషించిన 'సాక్షి' పాత్ర నన్ను స్టార్‌ని చేసింది. కెరీర్ అనేది కొన్నాళ్లు కొనసాగాలంటే ఫిట్‌గా ఉండాలి. అందుకే వర్కవుట్లు బోరింగ్ అయినా తప్పడం లేదు. ఫిట్‌నెస్ కోసం కిక్ బాక్సింగ్ లాంటివి కూడా చేస్తాను. యాక్షన్ సినిమాలు చేసేటప్పుడు ఆ ట్రైనింగ్ ఉపయోగపడుతుంది. ఖాళీ సమయాల్లో ఇంట్లో కూర్చొని బొమ్మలు గీస్తుంటా. నా బ్యాగ్‌లో ఎప్పుడూ ఓ బుక్, స్కెచ్ పెన్స్, పెన్సిల్స్ ఉంటాయి. అలాగే ఆమెరికన్ సిరీస్, సైకలాజికల్ థ్రిల్లర్స్ చూస్తూ ఎంజాయ్ చేస్తా' అంటూ సరదాగా చెప్పుకొచ్చారు కియారా అద్వానీ

# 'తెల్లకాగితం' విడుదల అప్పుడే



'కోర్ట్'ఫేం హర్ష్ రోషన్ హీరోగా రూపొందుతున్న యువతరం ప్రేమకథ 'తెల్ల కాగితం'. నక్షత్ర కథానాయిక. రమేశ్ బండ్రెడ్డి దర్శకుడు. కృష్ణ కొమ్మాలపాటి నిర్మాత. అక్టోబర్ 2న సినిమా విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో హీరోహీరోయిన్లు హర్ష్‌రోషన్, నక్షత్ర ఎంతో క్యూట్‌గా కనిపిస్తున్నారు.కురుస్తున్న వర్షపు చినుకులు, గొడుగులా అడ్డు పెట్టుకున్న అరిటాకు, నాయకానాయికల రొమాంటిక్ లుక్స్.. ఇవన్నీ ఎంతో సహజంగా.. సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉన్నాయి. ఇప్పటికే విడుదల చేసిన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై అంచనాలు పెంచిందని, అన్ని వర్గాల ప్రేక్షకులనూ ఆకట్టుకునేలా సినిమా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి రచన: నందు సవిరిగాన, కెమెరా: కేవీ గుహన్, సంగీతం: విజయ్ బుల్గానిన్, నిర్మాణం: అరుణాచల క్రియేషన్స్.

# పిల్లితో మొదలైన మిస్టరీ..

## 'హతః' టైటిల్ గ్లింప్స్‌తో ఆసక్తి పెంచిన కిరణ్ అబ్బవరం!




యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు.అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. "Is the cat alive or.." అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది. కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం 'హతః' చిత్రానికి సంబంధించిన షూటింగ్, కథ, పాత్రలు, విడుదల తేదీ వంటి వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌తోనే సినిమాపై ఆసక్తిని పెంచిన చిత్రబృందం.. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365